PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 336 | విజయవాడ, శుక్రవారం 7 జులై 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 7 July 2023 | Rs

ఢిల్లీ ఆర్డినెన్స్‌పై 10న విచారణ

- కేజ్రీవాల్ ప్రభుత్వ పిటీషన్‌కు సుప్రీం అంగీకారం

లోపలి పేజీలో..

రాష్ట్రంలో 1,59,024 ఇంజినీరింగ్ సీట్లు

- అనుమతిచ్చిన ఎఐసిటిఇ
- మొత్తం 252 కళాశాలలు

2



గృహ నిర్మాణాల పురోగతిపై మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి జగన్

వేగంగా గృహ నిర్మాణాలు

- స్వయం సమృద్ధి దిశగా టిడ్కో భవన సముదాయాలు
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- గృహ నిర్మాణశాఖపై సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గృహ నిర్మాణశాఖ పురోగతిపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం అధికారులతో సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణాల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఇప్పటి వరకు రాష్ట్రంలో 4,24,220 ఇళ్లు పూర్తయ్యాయని, ఆగస్టు ఒకటి నాటికి మరో ఐదు లక్షల ఇళ్లు పూర్తవుతాయని తెలిపారు. రూఫ్‌లెవల్, ఆ పైస్థాయిలో 5,68,517 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, వివిధ స్థాయిల్లో 9,56,369 ఇళ్లు ఉన్నాయని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో హౌసింగ్ కోసం రూ.2,201 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.

సిఆర్‌డిఎ పరిధిలో 45,101 మంది ఆప్షన్-3 ఎంపిక చేసుకున్నారని, ఈ మేరకు కాంట్రాక్టర్ల ఎంపిక కూడా పూర్తయిందని అధికారులు వివరించారు. లబ్ధిదారులతో బ్యాంకు ఖాతాలు తెరిచే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నీటి సరఫరా, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సరఫరా తదితర పనులపై దృష్టిపెట్టామని వివరించారు. ప్రాంతంలో పేదలకు ఇళ్ల నిర్మాణంపై పిటిషన్లు, కోర్టు విచారణలో అంశాన్ని అధికారులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. కాలనీలు పూర్తవుతున్న కొద్దీ మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణ వేగాన్ని ఇదే రీతిలో ముందుకు తీసుకెళ్లాలని, కోర్టు కేసులున్న ప్రాంతాల్లో తక్షణం ప్రత్యామ్నాయ భూముల సేకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. విశాఖలో ఇళ్ల నిర్మాణం నిర్దేశిత సమయంలోగా పూర్తికావాలని, ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. డిసెంబరు నాటికి విశాఖలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

కొత్తగా ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్నవారికి పట్టాలు ఇచ్చేందుకు భూములు సేకరించాలని ఆదేశించారు. వీటికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పేదలకు ఇళ్లు రానివ్వకూడదని నిరంతరం అడ్డంకులు సృష్టిస్తున్నారని, వీటన్నిటినీ అధిగమించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, దీనికి అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్వయం సమృద్ధి ప్రాంతాలుగా టిడ్కో భవనాలు

రాష్ట్రంలో టిడ్కో భవన సముదాయాలను స్వయం సమృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సిఎం జగన్ ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 71,452 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించామని, ఈ నెలలో మరో 29,496 ఇళ్లను, ఆగస్టులో 49,604 ఇళ్లు ఇస్తామని అధికారులు వివరించారు. 300 చదరపు అడుగులు ప్లాట్లను ఉచితంగా ప్రభుత్వం ఇస్తున్నందున మిగిలిన కేటగిరీల్లో 365, 430 చదరపు అడుగుల లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా దాదాపు రూ.2 వేలకోట్లు రుణాలుగా ఇప్పించామని అధికారులు వివరించారు. వందల, వేల సంఖ్యలో గృహాలు టిడ్కో సముదాయాలలో వుంటున్నందున వారి అవసరాలను తీర్చేలా వాణిజ్య సముదాయాలను ఏర్పాటుచేయాలని సిఎం ఆదేశించారు. తొలిదశలో 15 టిడ్కో సముదాయాల్లో మహిళల ఆధ్వర్యాన వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. టిడ్కో గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి లక్ష్మీశా, ఛైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో ఎమ్‌డి శ్రీధర్ పాల్గొన్నారు.

14న చంద్రయాన్-3 ప్రయోగం

- వేదిక కానున్న శ్రీహరికోటలోని రెండవ ప్రయోగశాల

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరోసారి ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 14న మధ్యాహ్నం 2 గంటల 35 నిమిషాలకు చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. గత వైఫల్యాలను సరిచేసి సరికొత్త సాంకేతిక పరికరాలతో తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని నుండి ఈ ప్రయోగం జరపడానికి శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) రెండవ ప్రయోగ వేదిక నుండి ఎల్‌విఎం మార్క్-3 రాకెట్ ద్వారా ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించనుంది. చంద్రునిపై ఉన్న వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేయడానికి, భవిష్యత్‌లో మానవ సహిత చంద్రయాన్ ప్రయాణానికి అవసరమైన పరిశోధనల కోసం ఈ ప్రయోగం నిర్వహిస్తోంది. ప్రయోగం జరిగిన 42 రోజుల తరువాత ఉపగ్రహంలోని ల్యాండర్ చంద్రునిపై దిగే విధంగా రూపకల్పన చేశారు. 2008లో మొదటి చంద్రయాన్-1 ప్రయోగంతో పంపిన ఆర్బిటర్ ద్వారా చంద్రునిపై నీటి ఆనవాళ్లను ఇస్రో గుర్తించింది. 2019 చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగంలో ఆర్బిటర్ ద్వారా ఒక ల్యాండర్‌ను, ఒక రోవర్‌ను పంపింది. లాండింగ్ సమయంలో సంబంధాలు తెగిపోవడంతో అది పాక్షిక విజయంగా మిగిలింది. అపజయాలను విజయాలకు సోపానాలుగా మలచుకుని ఇస్రో రెట్టించిన ఉత్సాహంతో ఇప్పుడు చంద్రయాన్-3కి రూపకల్పన చేసింది. ప్రయోగాన్ని విజయవంతం చేయడం ద్వారా ఇప్పటికే చంద్రునిపై అడుగు పెట్టి సత్తా చాటిన అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన చేరాలని చూస్తోంది. ఈ ప్రయోగానికి సంబంధించిన విండో జులై 12 నుండి 19 వరకు అందుబాటులో ఉంటున్న దృష్ట్యా 14వ తేదీని ముహూర్తంగా నిర్ణయించారు.



గురువారం ఇంఫాల్‌లోని బిరహరి కాలేజీలోని పునరావస శిబిరంలో బాధితుల్ని పరామర్శించి చిన్నారులను ముద్దు చేస్తున్న సిపిఎం ఎంపీలు బికష్ రంజన్ భట్టాచార్య, జాన్ బిట్టాస్

మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ

- స్కూలు సమీపంలో మహిళ కాల్చివేత
- సిపిఐ(ఎం), సిపిఐ ఎంపీల బృందం పర్యటన

ఇంఫాల్, న్యూఢిల్లీ : మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగింది. దాదాపు రెండు మాసాల తరువాత స్కూళ్లు తిరిగి తెరిచిన ఒక రోజుకే పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో ఓ పాఠశాల సమీపంలో మహిళను కాల్చి చంపారు. స్థానిక శిశు నిష్ఠా నికేతన్ పాఠశాల ఎదుట గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలి వివరాలు ఇంకా తెలియరాలేదు. రెండు నెలలుగా హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో 122 మంది దాకా చనిపోయారు. మరో 300 మందికిపైగా గాయపడ్డారు. 50 వేల కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. రాష్ట్రవ్యాపితంగా ఇంటర్నెట్‌ను బంద్ చేసింది. మణిపూర్ హింసాకాండలో బాధితులను పరామర్శించి, అక్కడి పరిస్థితిని పరిశీలించేందుకు సిపిఐ(ఎం), సిపిఐ ఎంపీల బృందం గురువారం రాష్ట్రంలో పర్యటించింది. శుక్రవారం కూడా పర్యటించి గవర్నరుకు ఒక మెమోరాండం సమర్పించనుంది.

హైకోర్టును ఆశ్రయించండి

మణిపూర్‌లో ఇంటర్‌నెట్ నిషేధంపై సుప్రీం

మణిపూర్‌లో రెండు మాసాలుగా అమల్లో వున్న ఇంటర్‌నెట్ నిషేధాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీం కోర్టు తిరస్కరించింది. మణిపూర్ హైకోర్టు దీన్ని ఇప్పటికే విచారించిందని పేర్కొంది. "దీనిపై డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. మీరు హైకోర్టుకు ఎందుకు వెళ్ళరు? ఎందుకంటే, మేం నోటీసులు జారీ చేసిన మరుక్షణం హైకోర్టు దీన్ని పరిశీలించడం ఆపేస్తుంది." అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచ్ ఇద్దరు పిటిషనర్లకు చెప్పింది. మణిపూర్ హైకోర్టు న్యాయవాది చోగతమ్ విక్టర్ సింగ్, వ్యాపారవేత్త మయేంగ్బమ్ జేమ్స్‌లు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో హైకోర్టు ఇంతవరకు దామాషా సూత్రాన్ని పరిశీలించలేదని పిటిషనర్ల తరపు న్యాయవాది షాదన్ ఫరాసత్ చెప్పారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, హైకోర్టు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో ఇంటర్‌నెట్‌ను పునరుద్ధరించవచ్చా లేదా అనేది పరిశీలించాల్సిందిగా ఆ కమిటీని ఆదేశించిందని చెప్పారు. "షాదన్ ఫరాసత్ ఈ విషయంలో దామాషా సూత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం వుందని చెబుతున్నారు. పైగా 226వ అధికరణపై పిటిషన్ కూడా పెండింగ్‌లో వున్నందున, ఈ అంశాన్ని ఇక ఇక్కడితో ఉపసంహరించుకోవడానికి ఫరాసత్ అనుమతి కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా అధ్యక్షులు పి.కె.శ్రీమతి

బలవంతపు సివిల్ కోడ్‌కు వ్యతిరేకం

- మోడీ ముదనష్టపు విధానాలపై పోరు
- అక్టోబరు 5న ఢిల్లీలో భారీ ర్యాలీ
- ఐద్వా అధ్యక్షులు పి.కె.శ్రీమతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి సివిల్ కోడ్ (యుసిసి)ను బలవంతంగా రుద్దడాన్ని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పూర్తిగా వ్యతిరేకిస్తుందని జాతీయ అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి స్పష్టం చేశారు. విభిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు ఉన్న లౌకిక భారతదేశంలో ఒకేమతం, ఒకేభాష, ఒకేచట్టం, ఒకే సంస్కృతి పేరుతో బిజెపి బలవంతపు చట్టాలు అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. గురువారం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీమతి మాట్లాడారు. మహిళలకు, లౌకికతత్వానికి మోడీ ప్రభుత్వం చేటు తెస్తోందన్నారు. నిత్యావసరాలతో సహా అన్ని రకాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, నిరుద్యోగం తీవ్ర రూపం దాల్చిందని, వీటన్నిటికి వ్యతిరేకంగా అక్టోబరు 5న ఢిల్లీలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఉమ్మడి పౌర స్మృతి అమలుకు దేశంలో పరిస్థితులు అనుకూలంగా లేవని, దేశం ఇంకా ఆ స్థితికి చేరుకోలేదని 2018లోనే లా కమిషన్ స్పష్టం చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. దేశంలో 40 శాతం మంది ప్రజలు ఇంకా పేదరికంలోనే ఉన్నారని, సమానత లేనిచోట ఉమ్మడి చట్టాల అమలు సాధ్యం కాదని

మిగతా 7లో

వర్శిటీల్లో కుల వివక్షపై ఏం చర్యలు తీసుకున్నారు?

- రోహిత్ వేముల, పాయల్ తాడ్వి తల్లులు దాఖలు చేసిన
- పిటిషన్‌పై యుజిసికి సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షను నిర్మూలించేందుకు ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)కి అత్యున్నత న్యాయస్థానం గురువారం ఆదేశించింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు మార్గదర్శకాల ఇవ్వాలని కోరుతూ రోహిత్ వేముల, పాయల్ తాడ్వి తల్లులు రాధిక వేముల, అబేద తాడ్వి దాఖలు చేసిన పిటిషన్లపై స్పందించిన సుప్రీం కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటీషన్‌ను జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేష్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఇది విద్యార్థులు, పిల్లలు ప్రాణాలు కోల్పోయిన తల్లిదండ్రుల ప్రయోజనాలకు సంబంధించిన అంశం. భవిష్యత్తులో అలా జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని యుజిసికి జస్టిస్ బోపన్న సూచించారు. ఈ పిటిషన్ వ్యతిరేకత లేనిదని, కాబట్టి అభ్యంతరాల రూపంలో సమాధానం

మిగతా 7లో

విలీన మండలాల్లో దీనావస్థలో రైతాంగం

- ముంపు సాకుతో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రుణాలకు ప్రభుత్వం మంగళం
- నాలుగేళ్లుగా అంపశయ్యపై వ్యవసాయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం విలీన మండలాల రైతులకు మొండిచేయి చూపిస్తోంది. దీంతో, ఆ ప్రాంతంలో వ్యవసాయ రంగం అంపశయ్యపైకి చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక, కూనవరం, విఆర్.పురం, చింతూరు మండలాల్లో అధికారుల గణాంకాల ప్రకారం 26,222 ఎకరాల్లో పంటల సాగు జరుగుతోంది. పోడు, నదీ పరివాహక లోతట్టు తదితర భూములు వెరసి క్షేత్రస్థాయిలో 50 వేల నుంచి 60 వేల ఎకరాలు సాగులో ఉన్నాయి. 373 గ్రామాలకు చెందిన 1.20 లక్షలకుపైగా గిరిజన, గిరిజనేతర కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నాయి. మొక్కజొన్న, మిర్చి, పొగాకు, మినుములు, పత్తి, వరి సాగు ఇక్కడ అధికం. అపరాలు, కొన్ని రకాల వాణిజ్య పంటలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి. అయితే, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. గోదావరి ముంపు మండలాల పేరుతో గత నాలుగు సంవత్సరాలుగా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రుణాలను ప్రభుత్వం ఇవ్వడం లేదు. 41.15, 45.72 కాంటూర్ల పరిధిల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎకరా వరి సాగుకు



విఆర్.పురంలో ఖాళీగా ఉన్న భూములు

రూ.30 వేలు, మొక్కజొన్నకు రూ.60 వేలు, నువ్వుల పంటకు రూ.20 వేలు, మిర్చికి రూ.1.50 లక్షలు, పత్తికి రూ.40 వేలు పెట్టుబడి ఖర్చవుతోందని గిరిజన రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారమూ లేకపోవడంతో సాగు పెట్టుబడి కోసం దళారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని, గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు అడిగిన ధరకు పంటలను విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. కొన్నిసార్లు దళారులు నియమించుకున్న ఏజెంట్లు నాసిరకం విత్తనాలను అంటగడుతున్నారని తెలిపారు. 2021లో చింతూరులో సుమారు 1500కుపైగా ఎకరాల్లో నాసిరకం వరి విత్తనాల వల్ల రైతులు నష్టపోయారు. ఇటువంటి ఉదాహరణలు

మిగతా 2లో

బిజెపిని గద్దె దించాలి

- కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే వ్యవసాయ సంక్షోభం
- నష్టాల ఊబిలో కూరుకుపోతున్న రైతాంగం
- సదస్సులో ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్



మాట్లాడుతున్న ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్

ప్రజాశక్తి-నెల్లూరు

దేశ ప్రధాని నరేంద్ర మోడీ దూకుడుగా అమలు చేస్తోన్న సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని, వ్యవసాయం దిగ్గుబాటు కాక నష్టాల ఊబిలో రైతులు కూరుకుపోతున్నారని ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని తెలిపారు. బిజెపిని గద్దెదించి కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకు రైతాంగం పోరాడాలని పిలుపునిచ్చారు. 'వ్యవసాయ రంగం సంక్షోభం - ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై ఎపి రైతు సంఘం, ఎపి కౌలురైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు సంయుక్తాధ్వర్యంలో నెల్లూరులోని టౌన్ హాలులో గురువారం సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్జూ కృష్ణన్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారం ఇస్తే వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు మద్దతు ధరలు ప్రకటిస్తామని, విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు సబ్సిడీతో అందజేస్తామని, తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాలు ఇస్తామని, రైతులకు మంచి రోజులు తెస్తామని 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ, బిజెపి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఉపాధి హామీ చట్టం కింద ఏటా 200 రోజులు పని అవకాశం కల్పిస్తామని, అధికంగా కూలి ఇస్తామన్నారని గుర్తు చేశారు. వీటిని అమలు చేయాలని కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎఐకెఎస్ నాయకత్వం కోరితే, ఎన్నికల్లో అనేక హామీలు చేస్తామని అవి కేవలం ఓట్ల కోసమేనని సమాధానం ఇచ్చారని తెలిపారు. 2014 నుంచి విత్తనాలు, ఎరువులు ఇలా అన్ని ధరలూ ఆకాశాన్నంటుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం కింద ఏడాదిలో 40 రోజులు మాత్రమే పని కల్పిస్తోందని

మిగతా 7లో

19న అఖిల పక్ష సమావేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 20న పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా దీనికి ఒక రోజు ముందు కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి. ఈ సమావేశాల్లో యుసిసితోపాటు మరికొన్ని కీలక బిల్లులను ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, దేశ రాజధాని నగరం ఢిల్లీ ప్రభుత్వ సవరణ ఆర్డినెన్స్‌లను ప్రవేశపెట్టవచ్చు. యుసిసిపై జూలై 3న జరిగిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో కాంగ్రెస్, డిఎంకె ఉమ్మడి పౌర స్మృతికి వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరిని ప్రదర్శించాయి. అలాగే, మరోవైపు బిజెపి నేతృత్వంలో ఎన్డీయేను రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓడించేందుకు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఏకమవుతుండటంతో ఈ సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. అఖిల పక్ష సమావేశంలోనూ ఇవి చర్చకు వచ్చే అవకాశం ఉంది.

హైకోర్టు సిజెగా ధీరజ్ సింగ్



జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

- మరో ఆరు హైకోర్టులకు సిజెలు
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు నూతన ప్రధాన న్యాయమూర్తుల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టుకు జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను, తెలంగాణ హైకోర్టుకు జస్టిస్ అలోక్ ఆరాధేను కొలీజియం సిఫార్సు చేసింది. ఈ రెండు రాష్ట్రాలతో పాటు కేరళ, ఒరిస్సా, ముంబయి, గుజరాత్, మణిపూర్ ఏడు హైకోర్టులకు కూడా నూతన ప్రధాన న్యాయమూర్తులను సిఫార్సు చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం ఆమోదించిన తీర్మానాలను బుధవారం రాత్రి అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ముంబయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధీరాజ్ సింగ్ ఠాకూర్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియామకానికి సిఫార్సు చేసింది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్‌ను గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, గుజరాత్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆశిష్ జె దేశాయ్‌ను కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఒరిస్సా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాసిస్ తలపాత్రను అదే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్‌ను మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను ముంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించేందుకు సిఫార్సు చేశారు. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపాల్సి ఉంది.

నాలుగేళ్ల తరువాత భూ పంపిణీ గుర్తొచ్చిందా?

- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికారం చేపట్టి నాలుగేళ్లు గడిచిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి భూ పంపిణీ గుర్తుకు రావడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయడం ద్వారా గ్రామీణ కష్టజీవులకు కుటుంబానికి 2.50 ఎకరాల భూమి ఇవ్వాలని, ఇప్పటికే సాగులో ఉన్న భూముల్లో గ్రామీణ కష్టజీవులకు అన్ని రకాల హక్కులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తూనే ఉందని వారు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజలను గందరగోళానికి గురిచేసేలా ముందస్తు ఎన్నికలపై టిడిపి దుష్ప్రచారానికి పూనుకుందని, తమ ప్రభుత్వం పూర్తికాలం వుంటుందని, ముందస్తుకు వెళ్లే ప్రసక్తే లేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం తమకు లేదని, మీడియాలో వస్తున్న ముందస్తు ఊహాగానాలను ఆయన ఖండించారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటామన్నారు. రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. ముందస్తు అనేది ఊగిసలాడే వారిని పార్టీలోకి చేర్చుకునేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆడుతున్న మైండ్ గేమ్ అని అన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్లు రాకూడదని టిడిపి కోరుకుంటుంటే, తమ ప్రభుత్వం ఒక యజ్ఞంలా పేదలకు ఇళ్లను ఇస్తోందని తెలిపారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి

ప్రజాశక్తి - రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో గురువారం సాయంత్రం పిడుగుపడి ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి గాయాలుపాలయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. వేల్పురాయి గ్రామానికి చెందిన గురాన మహాలక్ష్మినాయుడు (37), మరో పశువుల కాపరి చిన్నంనాయుడుతో కలిసి గ్రామ సమీపంలోని పొలాల్లోకి పశువులను తోలుకుని వెళ్లారు. వారికి సమీపంలో పిడుగు పడటంతో మహాలక్ష్మి నాయుడు అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయారు. చిన్నంనాయుడు గాయాల పాలయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి వివాదంతోనే ముగ్గురి హత్య

- పల్నాడు జిల్లా ఎస్‌పి


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా ధూళిపాళ్లలో జరిగిన హత్యలకు ఆస్తి తగాదాలే కారణమని పల్నాడు జిల్లా ఎస్‌పి వై. రవిశంకర్‌రెడ్డి తెలిపారు. హత్యలు జరిగిన స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ధూళిపాళ్ల గ్రామంలో పెద్ద మీరా సాహెబ్, చిన్న మీరా సాహెబ్ అనే ఇద్దరు అన్నదమ్ముల పిల్లలకు మధ్య ఉన్న ఆస్తి తగాదాల నేపథ్యంలో హత్యలు జరిగాయని చెప్పారు. పెద్ద మీరా సాహెబ్ కొడుకు ఖాసింకు చిన్న మీరా సాహెబ్ కొడుకు రహిమాన్ ఇటీవల రూ.5000 నగదు అప్పుగా ఇచ్చాడని, ఈ సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో వివాదానికి దారితీసిందని చెప్పారు. గతంలో ఉన్న ఆస్తి తగాదాలను మనసులో పెట్టుకొని, రహమాన్ కుటుంబాన్ని చంపితే మిగిలిన మొత్తం ఆస్తి కూడా తమకే వస్తుందన్న దురుద్దేశంతో ఖాసిం తన కొడుకు జాకీర్ సహాయంతో బుధవారం ఉదయం రహిమాన్‌ను తొలుత హత్య చేశాడని తెలిపారు. తర్వాత ఖాసిం తన కొడుకు జాకీర్‌తో కలసి ధూళిపాళ్ళలోని తన బాబాయ్ ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న బాబాయ్ భార్య రహిమూన్‌ను, ఆమె కుమార్తె మాలింబిని హత్య చేశారని చెప్పారు. ఈ కేసును త్వరితగతిన పూర్తిచేసి, ఛార్జ్‌షీటును వీలైనంత త్వరగా కోర్టులో దాఖలు చేస్తామని ఎస్‌పి తెలిపారు.

రాష్ట్రంలో 1,59,024 ఇంజినీరింగ్ సీట్లు

- అనుమతిచ్చిన ఎఐసిటిఇ
- మొత్తం 252 కళాశాలలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్లను అఖిల భారత సాంకేతిక విద్య మండలి (ఎఐసిటిఇ) ఖరారు చేసింది. 2023-24 విద్యాసంవత్సరానికి 1,59,024 ఇంజినీరింగ్ సీట్లను మంజూరు చేసింది. రాష్ట్రంలో 252 కళాశాలలు, 4 డీమ్డ్ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ సీట్లకు అనుమతిస్తున్నట్లు పేర్కొంది. 17 ప్రభుత్వ యూనివర్సిటీ కళాశాలల పరిధిలో 5,130 సీట్లు, 235 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,44,024 సీట్లకు అనుమతిచ్చింది. 4 డీమ్డ్ ప్రైవేట్ కళాశాలల్లో 8,430 సీట్లు, అదేవిధంగా 4 ఆర్‌జికెటియు కళాశాలల్లో 1,440 సీట్లు మంజూరు చేసింది. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ) కోర్సుకు ప్రభుత్వ కళాశాలల్లో 1,200 సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో 76,530 సీట్లు ఖరారు చేసింది. గతేడాది కంటే ప్రైవేట్ కళాశాలల్లో 10,530 సిఎస్ఇ సీట్లను పెంచింది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 5,730 ఐటి సీట్లు, 9,285 సివిల్, 11,190 మెకానికల్, 11,760 ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, 31,425 ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ సీట్లను ఖరారు చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ మహిళా కళాశాలలో కొత్తగా 60 ఐటి సీట్లు, రాయలసీమ యూనివర్సిటీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్లో 60 సీట్లకు అనుమతివ్వడంతో పాటు 60 సిఎస్ఇ సీట్లను పెంచింది. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో నాలుగు కొత్త కోర్సులకు 60 సీట్లు చొప్పున 240 కేటాయించింది. కొత్తగా కడప జిల్లా రాయచోటిలో భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, చిత్తూరు జిల్లాలో విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నెల్లూరులో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతిచ్చింది. ఒక్కో కళాశాలలో 360 సీట్ల చొప్పున 1,080 సీట్లు మంజూరు చేసింది. కృష్ణా జిల్లా ఆగిరిపల్లిలోని ఎస్ఆర్ఐ కళాశాల, ప్రకాశం జిల్లా పిఎసిఇ కళాశాలలో సిఎస్ఇ కోర్సును తెలుగులో చదువుకునేందుకు ఎఐసిటిఇ అనుమతిచ్చింది.

సీఫుడ్స్‌లో ప్రమాదాలు పునరావృతం కానీయొద్దు

- సిఐటియు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-జరుగుమల్లి (ప్రకాశం జిల్లా)

మున్నంగి సీఫుడ్స్‌లో సంఘటనల వంటివి పునరావృతం కాకుండా యాజమాన్యం చర్యలు చేపట్టాలని సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సిఫుడ్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 16 మంది మహిళా కార్మికులు బుధవారం తీవ్రమైన జ్వరాలతో బాడీ పెయిన్స్‌తో, అస్వస్థతకు గురై.. ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చేరిన విషయం తెలిసిందే.. వీరిని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి రాము, కెవిపిఎస్ ఉపాధ్యక్షులు, వర్కర్స్ ఫుడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎంఐసి రెడ్డి గురువారం పరామర్శించి ధైర్యం చెప్పారు. మున్నంగి సీ ఫుడ్స్ కర్మాగారం వద్దకు సిఐటియు బృందం వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అక్కడి యాజమాన్యం శ్రీనివాసరావు, టి రామారావుతో, సిబ్బందితో మాట్లాడారు. ఆ 16 మందికి అదనంగా ఒక నెల వేతనం ఇచ్చి వారు పూర్తిగా కోలుకునే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల పరిశీలన

సీఫుడ్స్ కంపెనీని ఒంగోలు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ యస్ శ్రీనివాసరావు, సహాయ కమిషనర్లు కోటేశ్వరరావు, కె పవన్‌కుమార్, బి అనితావాణి గురువారం పరిశీలించారు.

మే నెలలోనూ విద్యుత్ ఛార్జీలపై సర్దుబాటు భారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థలు వినియోగదారులపై భారాలను ఈ నెల కూడా కొనసాగిస్తోంది. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారుల నడ్డి విరుస్తోంది. 15 నెలల కాలంలోనే 50 శాతం విద్యుత్ ఛార్జీలను పెంచేసింది. దీంతో బిల్లులు చూసుకుంటూ వినియోగదారులు షాక్‌లోకి వెళ్తున్నారు. ఏప్రిల్‌లో వినియోగించిన విద్యుత్‌కు డిస్కమ్‌లు జూన్‌లో సర్దుబాటు ఛార్జీలను వసూలు చేశాయి. యూనిట్‌కు 40 పైసలు చొప్పున వసూలు చేశాయి. జులై బిల్లులో కూడా మే నెలలో వినియోగించిన విద్యుత్‌కు 40 పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలను డిస్కమ్‌లు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే ట్రూఅప్, శ్లాబుల మార్పుల విధానంతో అల్లాడుతున్న వినియోగదారులపై నెల విధానంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా డిస్కమ్‌లు మరింత భారాలు మోపుతున్నాయి. 2022 మార్చి వరకు 75 యూనిట్ల విద్యుత్ వినియోగానికి రూ.135, కస్టమర్ ఛార్జీలు రూ.50, ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10, విద్యుత్ సుంకం రూ.10.38లతో కలుపుకుని రూ.205 బిల్లు వచ్చేది. 2022 ఏప్రిల్ నుంచి కొత్త శ్లాబుల విధానాన్ని ఇంధనశాఖ తీసుకొచ్చింది. ఈ విధానంతోపాటు ట్రూఅప్, సర్దుబాట్లతో బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. గతంలో 75 యూనిట్లకు రూ.205 లోపు వచ్చే బిల్లు ఇప్పుడు అదే 75 యూనిట్లకు 50 శాతానికి పైగా పెరిగింది. 75 యూనిట్ల వినియోగానికి రూ.192 బిల్లుతోపాటు ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10, కస్టమర్ ఛార్జీలు రూ.50, విద్యుత్ సుంకం రూ.10.38తో పాటు ట్రూఅప్ రూ.16.5, మొదటి సర్దుబాటు ఛార్జీలు రూ.15, మే సర్దుబాటు ఛార్జీలు రూ.30లతో కలుపుకుని రూ.324 చెల్లించాలి. అంటే ఏడాదిలోన్నరలోనే 50 శాతానికి పైగా కరెంటు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.

మోడీ హటావో దేశ్ బచావో

- 'క్విట్ కార్పొరేట్ దొంగలు' పేరుతో ఆందోళనలు
- నవంబరు 26, 27, 28 తేదీల్లో
- గవర్నరు కార్యాలయాల ముందు నిరసనలు
- ఆలిండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయంలో నెలకొన్న సంక్షోభంతో లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే, 2.5 లక్షల మంది వలస కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో మోడీ అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మోడీ హటావో దేశ్ బచావో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా, అన్ని కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశం ఈ నెల 13న జరగనుందని తెలిపారు. అలాగే కార్పొరేట్ల దోపిడీని నిరసిస్తూ క్విట్ ఇండియా జాతీయోద్యమ స్ఫూర్తితో ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ దొంగలు, నవంబరు 26, 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల గవర్నర్ల కార్యాలయాల ముందు రైతులు, కార్మికులతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ఆచరణలో వ్యవసాయాన్ని కార్పొరేట్ విధానాలతో తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టేశారని విమర్శించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలను, ఎరువులను, నాణ్యమైన విత్తనాలను, పెట్టుబడులకు అవసరమైన రుణాలను అందిస్తామన్న మోడీ ప్రభుత్వం ఆచరణలో అందుకు విరుద్ధంగా పోతోందని విమర్శించారు. వరి క్వింటాకు రూ.2,866 వుండాల్సిన మద్దతు ధర రూ.2,180 మాత్రమే వుందని తెలిపారు. రాష్ట్రంలో రూ.3,208 వుండాలని, ఇలా ప్రతి క్వింటాకు రైతు రూ.1,025ను నష్టపోతున్నారని అన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో కేవలం వరిరైతులే మద్దతు ధరల రూపంలో రూ.13,540 కోట్లు నష్టపోయారని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం రైతులను నిలువునా ముంచుతోందని విమర్శించారు. ఫసల్ బీమాతో రైతులకు మేలు జరక్కపోగా ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రం ఈ ఏడాది రూ.41 వేలకోట్ల ఆదాయాన్ని ఆర్జించాయని తెలిపారు. బిజెపి రోల్‌మోడల్ రాష్ట్రం గుజరాత్ కూడా తమ రాష్ట్రంలో ఫసల్ బీమాను అమలు చేయబోమని చెప్పిందన్నారు. రైతులను నిలువునా దోపిడీ చేస్తూ రైతులకు రూ.6.5 లక్షల కోట్లు ఇచ్చామని మోడీ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రైతుల పోరాటంతో మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దుచేసినా విద్యుత్ సవరణ చట్టం మాత్రం అలాగే వుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సవరణ చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ప్రాంతంలో 3హెచ్‌పి వినియోగించిన రైతుకు రూ.7 వేల విద్యుత్ బిల్లు వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు ఈ చట్టాన్ని తెచ్చారని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కౌలు రైతుల రక్షణ కోసం వున్న చట్టాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంతకం వుంటేనే కౌలురైతుగా గుర్తిస్తామని సవరణ చేసి కౌలుదారులకు తీవ్రమైన నష్టం చేశారని తెలిపారు. ఈ సమస్యలన్నిటిపై కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు.

కాలపరిమితి తీరిన విత్తనాలను అంటగట్టడం సిగ్గుచేటు

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కాలపరిమితి తీరిన విత్తనాలను రైతు భరోసా కేంద్రాలలో అమ్మకాలకు అందుబాటులో వుంచడం సిగ్గుచేటని ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు విమర్శించారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందించకుండా విత్తన కంపెనీల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం నాసిరకం విత్తనాలను అంటగడుతోందన్నారు. ఫసల్ బీమా అమలులో రైతులకు తీవ్రమైన అన్యాయం చేశారని తెలిపారు. పత్తిపంటకు పెట్టుబడి రూ.20 వేలు అయితే ఫసల్ బీమాలో కేవలం రూ.1,300లే ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. దేవదాయశాఖ భూములను కౌలురైతులకు ఇవ్వకుండా నేరుగా వేలంపాటకు పెట్టడం వల్ల పెత్తందారులు పాడుకుని ఎక్కువ ధరకు కౌలురైతులకే ఇస్తున్నారని తెలిపారు.

పెట్టుబడులకు అనుగుణంగా రుణాలివ్వాలి

రాష్ట్రంలో పంటలకు పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా బ్యాంకు రుణాలను రైతులకు అందించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు సున్నా వడ్డీ, పావలా వడ్డీ రాయితీలకు సంబంధించి రుణపరిమితిని పెంచాలని కోరారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డెయిరీ రంగాన్ని బలోపేతం చేసేలా ప్రతి లీటర్‌కు నాలుగు రూపాయల బోనస్‌ను ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో రాష్ట్ర డెయిరీ రంగాన్ని నిర్వీర్యం చేసేలా మొత్తం గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీకి కట్టబెడుతున్నారని విమర్శించారు. చిత్తూరు విజయ డెయిరీని శ్రీజలాంటి స్థానిక డైరీలకు ఇవ్వకుండా అమూల్‌కు కట్టబెట్టడం తగదన్నారు. అలాగే రైతులకు చేదోడు వాదోడుగా వున్న సహకార రంగాన్ని నిర్వీర్యం చేసేలా సహకార సొసైటీలలోకి ప్రైవేట్ వ్యక్తులను, వాణిజ్య సంస్థలను జొప్పించడం సరైందికాదన్నారు. సాగునీటి ప్రాజెక్టులన్నిటినీ అటకెక్కించారని, తక్షణం ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, సీనియర్ నాయకులు వై కేశవరావు పాల్గొన్నారు.

జివిఎల్ జన్మదిన వేడుకలు అడ్డగింత

- స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టినవారికి ఇక్కడ చోటులేదు
- తేల్చిచెప్పిన ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కునగరంలో బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లును ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అడ్డుకున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన బిజెపికి చెందిన ఎంపి జన్మదిన వేడుకలు ఇక్కడ జరగడానికి వీల్లేదంటూ నిరసన తెలిపారు. దీంతో గురువారం సాయంత్రం ఉక్కునగరం క్లబ్ సమీపంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. అయినా వెరవకుండా 'గో బ్యాక్ జివిఎల్' అంటూ కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఉక్కునగరం క్లబ్ నిర్వాహకులతో పోరాట కమిటీ నాయకులు చర్చించారు. జివిఎల్ జన్మదిన వేడుకలను ఉక్కునగరం క్లబ్‌లో నిర్వహించొద్దని, హాల్‌ను బుక్ చేసిన వారి వివరాలు తెలియజేయాలని పట్టుబట్టారు. కార్మికుల మధ్య చిచ్చు పెట్టడానికే జివిఎల్ జన్మదిన వేడుకలను ఉక్కునగరంలో ఏర్పాటు చేశారని కార్మిక నేతలు మండిపడ్డారు. ఆందోళన అంతకంతకూ పెరుగుతుండటంతో కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఉక్కు నగరం క్లబ్ ప్రకటించింది. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా ఉంటే ఎవ్వరూ స్టీల్‌ప్లాంట్ లోపలకు అడుగుపెట్టలేరని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఎసిబి వలలో అనంతపురం సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



సత్యనారాయణమూర్తి

దాన విక్రయ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లంచం తీసుకుంటూ అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఆయనతోపాటు రైటర్, సహాయకుడిని ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. వీరి ముగ్గురిని శుక్రవారం కర్నూలు అవినీతి నిరోధక శాఖ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఎసిబి ఇన్‌ఛార్జి డిఎస్‌పి ప్రభాకర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. నగరంలోని కోమలి రెసిడెన్సీ అనే హోటల్‌కు సంబంధించి అన్నదమ్ముల మధ్యనున్న ఆస్తి దానవిక్రయంతో ముడిపడి ఉంది. 4.5 సెంట్ల స్థలాన్ని పూర్వంలో ముత్తుకురు రామ్మోహన్, రవీంద్రనాథ్ కలిసి కొనుగోలు చేశారు. రవీంద్రనాథ్ మృతి చెందడంతో ఆస్తిని తన పేరు మీదకు మార్చుకునేందుకు రామ్మోహన్ ప్రయత్నించారు. దీన్ని పెండింగ్ రిజిస్ట్రేషన్‌గా సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ నమోదు చేశారు. రెగ్యులర్ రిజిస్ట్రేషన్‌గా మార్చాలంటే రూ. రెండు లక్షలు లంచమివ్వాలని డిమాండ్ చేశారు. రూ.1.30 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అంత డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని రామ్మోహన్ అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు.

డబ్బులివ్వడానికి రామ్మోహన్ సబ్ రిజిస్ట్రార్‌ను కలవగా, ఆ డబ్బులు రైటర్ చంద్రశేఖర్‌కు ఇవ్వాలని సూచించారు. రైటర్‌కు డబ్బులిచ్చేందుకు వెళ్లగా ఆయన తన సహాయకుడు కృష్ణమురళీకి ఇవ్వమని చెప్పాడు. వెంటనే అవినీతి నిరోధక శాఖ అధికారులు ముగ్గురినీ పట్టుకున్నారు. అనంతరం విచారణ చేపట్టారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పట్టుబడిన ముగ్గురు నుంచి రూ.1.30 లక్షల నగదు తీసుకుని, వారిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

సిపిఎస్ ఉద్యోగుల ధర్నాలకు సిఐటియు, జెఎసి మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓల్డ్ పెన్షన్ స్కీమును పునరుద్ధరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జిపిఎస్ తమకు ఆమోదయోగ్యం కాదని, ఈ నెల 8న సిపిఎస్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ధర్నాలకు మద్దతు ఇస్తున్నట్లు సిఐటియు ప్రకటించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. అలాగే సిఐటియు అనుబంధ సంఘాల సభ్యులు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. వారంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు గడిచినా రద్దు చేయలేదని తెలిపారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించకుండా, సిపిఎస్ ఉద్యోగులకు నష్టం కలిగించేలా జిపిఎస్‌ను ప్రతిపాదించడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఉద్యోగులతో చర్చలు జరిపి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్ వర్కర్స్ జెఎసి కూడా 8వ తేదీ ఆందోళనకు మద్దతు తెలిపింది. ఈ మేరకు సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి, కో-ఛైర్మన్ విజయకుమార్‌రాజు, కార్యదర్శి నూర్‌మహ్మద్ వేరొక ప్రకటన విడుదల చేశారు.

వైసిపి అనుకూల సర్వేలతో చంద్రబాబుకు వణుకు

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2019 తరహాలో 2024 ఎన్నికల్లోనూ వైసిపి క్లీన్ స్వీప్ చేస్తుందని టైమ్స్ నౌ, ఇండియా టుడే సర్వేలతో చంద్రబాబుకు వణుకు పట్టుకుందని గురజాల వైసిపి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విమర్శించారు. జగన్ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ చూసి తట్టుకోలేక యరపతినేని శ్రీనివాసరావు వంటి అవినీతి పరులను రంగంలోకి దింపి అబద్ధాలను ప్రచారం చేయిస్తున్నారన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిమెంటు ధరలు టిడిపి హయాంలోనే భారీగా పెరిగాయని తెలిపారు. మద్యంపై కూడా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, రాష్ట్రంలో మద్య నిషేధం ఎత్తివేసింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మద్యం తయారీ మొత్తం టిడిపి నేతల చేతుల్లోనే వుందని అన్నారు.

సాహితి ఫార్మా పేలుడు క్షతగాత్రుల్లో..

మరో ఇద్దరు కార్మికులు మృతి

ప్రజాశక్తి - రాంబిల్లి(అనకాపల్లి జిల్లా)



నూకినాయుడు (ఫైల్)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితి ఫార్మాలో గత నెల 30న జరిగిన భారీ పేలుడులో గాయపడి చికిత్స పొందుతున్న వారిలో మరో ఇద్దరు గురువారం కెజిహెచ్‌లో మృతి చెందారు. దీంతో ప్రమాద మృతుల సంఖ్య ఆరుకు చేరింది. పేలుడు సంభవించిన కొద్దిసేపటికే గత శుక్రవారం ఇద్దరు కార్మికులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన సమ్మంగి అప్పారావు, సోమవారం ఒడిశాకు చెందిన రామేశ్వర్ ప్రయివేటు ఆస్పత్రుల్లో మృతి చెందారు. గురువారం రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామానికి సింగంశెట్టి నూకినాయుడు, నక్కపల్లి మండలం రేబాకకు చెందిన ఎస్ రాజబాబు చనిపోయారు. వీరికి మృతికి సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది.

పరిహారం కోసం ఒప్పందం

నూకినాయుడు కుటుంబానికి సాహితీ ఫార్మా యాజమాన్యం గురువారం రూ.లక్ష పరిహారం అందజేసింది. ఈ నెల 12న రూ.8 లక్షలు, ఆగస్టు 10న రూ.25 లక్షలు ఇచ్చేందుకు రాతపూర్వకంగా అంగీకరించింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల నాయకులు రామకృష్ణ, రాంబిల్లి వైస్ ఎంపిపి కసిరెడ్డి నర్సింగరావు, లాలం రాజు, కాంట్రాక్టర్ రమేష్, మురళీకృష్ణ, మృతుని భార్య లలిత, కుమారుడు కార్తీక్, యాజమాన్యం తరుపున ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబుపై సిఐడి కేసు 21కి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి సమీప గ్రామాల్లో ముందుగానే పేదల నుంచి భూములు కొనుగోలు చేసి రాజధాని కోసం భూ సమీకరణకు ఇచ్చి అందుకు ప్రతిఫలంగా స్థలాలు తీసుకున్నారనే అభియోగాలను కొట్టేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ ఈ నెల 21కి వాయిదా పడింది. ఈ మేరకు గురువారం జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఆదేశాలు జారీ చేశారు. వీరిద్దరూ ప్రభుత్వం నుంచి ఖరీదైన నివాస, వాణిజ్య ప్లాట్లు కొనుగోలు చేశారని సిఐడి కేసు నమోదు చేసింది. దీనిని కొట్టేయాలని వారి అభ్యర్థించారు.

విదేశాలు వెళ్లేందుకు ఎబికి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

ఆర్జిత సెలవులపై 41 రోజులు విదేశాలకు వెళ్లేందుకు ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావుకు అనుమతివ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనుమతి నిరాకరిస్తూ సిఎస్ ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. విదేశాల నుంచి తిరిగి వాస్తానని ఎబి పోలీసులకు హామీ ఇవ్వాలని షరతు విధిస్తూ, జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ గురువారం తీర్పు చెప్పారు. ఎబిపై కేసులు విచారణలో ఉన్నందున ఆర్జిత సెలవులపై అమెరికా, యుకె వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని హైకోర్టులో సవాల్ చేయడంతో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆగస్టు 10న తుది విచారణ

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి ప్రాంతంలో బిసిలు, దళితుల నుంచి 1,100 ఎకరాల అసైన్డ్ భూమిని కాజేశారనే సిఐడి కేసును కొట్టేయాలని మాజీ మంత్రి పి నారాయణ దాఖలు చేసిన కేసులపై ఆగస్టు 10న తుది విచారణ చేపడతామని హైకోర్టు ప్రకటించింది. నారాయణ, ఆయన బంధువులు, బినామీలపై 2020లో సిఐడి నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వారంతా దాఖలు చేసిన పిటిషన్లను న్యాయమూర్తి జస్టిస్ కె సురేష్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. గతంలోని ముందస్తు బెయిల్ ఉత్తర్వులను తదుపరి విచారణ జరిగే ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణ సమీప బంధువులు, బినామీలు దాఖలు చేసిన వ్యాజ్యాలను విచారించిన హైకోర్టు సిఆర్‌పిసి 41-ఎ సెక్షన్‌ను అనుసరించాలంది. అనారోగ్య సమస్యల కారణంగా వైద్య చికిత్స కోసం విదేశాలు వెళ్లేందుకు వీలుగా నారాయణ మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు ఉత్తర్వులు పొందారు. తాజాగా జరిగిన విచారణ సమయంలో తిరిగి వాయిదా వేయాలని పిటిషనర్ల న్యాయవాదులు కోరగా.. సిఐడి తరపున అదనపు ఎజి పి సుధాకర్‌రెడ్డి వ్యతిరేకించారు. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వస్తారని చెప్పి వాయిదా కోరడం అన్యాయమన్నారు. నారాయణ తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ కల్పించుకుని సిఐడి కూడా వాయిదాలు కోరిందన్నారు. దీంతో ఆగస్టు 10న తుది విచారణ చేపడతామని హైకోర్టు ప్రకటించింది.

రాష్ట్రంలో వర్షాలు అడపాదడపే!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒడిశా, గంగా పరివాహక పశ్చిమ బెంగాల్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం, మరోవైపు రుతుపవన ద్రోణి ప్రభావంతో ఉత్తర భారతదేశంలో వర్షాలు ముమ్మరంగా కురవనున్నాయి. మన రాష్ట్రంలో పలుచోట్ల మరో వారం రోజుల పాటు అడపాదడపా వర్షాలే కొనసాగుతాయి మినహా భారీ స్థాయిలో కురిసే అవకాశాలు తక్కువని వాతావరణ శాఖ అధికారులు గురువారం రాత్రి వెల్లడించారు. ఉత్తర ఒడిశాపై సగటు సముద్రమట్టానికి 1.5, 7.6 కిలోమీటర్ల ఎత్తులో పైకిపోయే కొద్దీ నైరుతి దశలో ఉపరితల ఆవర్తనం వల్ల వర్షాలు ఆ ప్రాంతంలో అధికంగా పడనున్నాయి. ఈ నెల 10వ తేదీలోపు వర్షాలు మన రాష్ట్రంలో బాగా కురవాల్సి ఉన్నా, రుతుపవన ద్రోణి ఇక్కడ ప్రభావం చూపనందున వర్షాలు తగ్గుతున్నాయని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. గడిచిన 24 గంటల్లో అమరావతి ప్రాంతంలో 4 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదైంది. రాష్ట్రంలో కళింగపట్నంలో రెండు మిల్లీమీటర్లు, విశాఖలో ఒక మిల్లీమీటరు, మిగతా ప్రాంతంలో అడపాదడపా మాత్రమే నమోదైందని అధికారులు తెలిపారు.

సిఎంతో 'పొంగులేటి' భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తెలంగాణకు చెందిన మాజీ ఎంపి, కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భేటీ అయ్యారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎంను పొంగులేటి కలిశారు. ఇటీవల రాహుల్ గాంధీ సమక్షంలో పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు, జగన్ సోదరి వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్న పొంగులేటి.. జగన్‌తో సమావేశం కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరిక అన్న అంశంపైనే వీరు చర్చించినట్లు తెలిసింది.

విలీన మండలాల్లో దీనావస్థలో రైతాంగం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి మండలంలోనూ ఉన్నాయి. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావడంతో సారవంతమైన నల్లరేగడి భూములు ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాలతో పోల్చితే ఏ మాత్రమూ తీసికట్టు కాదని ఇక్కడి రైతులు చెబుతున్నారు.

సబ్సిడీ రుణాలు అందడం లేదు

నాకు రేఖపల్లిలో ఎనిమిది ఎకరాల సాగు భూమి ఉంది. ఏటా ధాన్యం, నువ్వులు పండిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ముంపు రికార్డులలో మా గ్రామం లేదు. అయినా, 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సబ్సిడీ రుణాలు, ఎరువులు, విత్తనాలు మంజూరు చేయడం లేదు. 2020లో సాగు కోసం ప్రయివేట్ అప్పు చేశాను. పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించక తప్పలేదు. వారు అడిగిన ధరకు విక్రయించడంతో నష్టం వచ్చింది. గతేడాది వరదల వల్ల నష్టపోయాను. ఈ ఏడాది రైతు భరోసా కేంద్రానికి వెళ్లి సబ్సిడీ విత్తనాలు అడిగితే ఇచ్చేదిలేదని అక్కడి సిబ్బంది తేల్చి చెప్పారు.

-కురసం జయరాజు, గిరిజనుడు, ఉమ్మడివరం, విఆర్.పురం మండలం

ప్రభుత్వం సహకరించాలి

మా కుటుంబానికి 18 ఎకరాల భూమి ఉంది. ఏటా దళారుల వద్ద అప్పు తీసుకుంటున్నాను. నూటికి రూ.3 చొప్పున వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. మా ఊరు 45.72 కాంటూరు పరిధిలో ఉంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ముంపులో లేదు. అయినా, ప్రభుత్వ యంత్రాంగం ఎటువంటి సహకారమూ అందించడం లేదు. ఏటా లక్షల రూపాయలు అప్పు చేసి సాగు చేయడం, దళారులు అడిగిన ధరకు విక్రయించడంతో కొన్నిసార్లు కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. మమ్మల్ని తరలించే వరకైనా సబ్సిడీ రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించాలి.

-కె.మారయ్య, గిరిజనుడు, ఉమ్మడివరం, విఆర్.పురం మండలం

ఎపిసిపిఎస్ఇఎ ధర్నాకు ఫ్యాప్టో మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) సాధన కోసం ఎపిసిపిఎస్ఇఎ పిలుపునిచ్చిన ధర్నాకు ఫ్యాప్టో మద్దతు తెలిపింది. ఈ మేరకు ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8న ఎపిసిపిఎస్ఇఎ చేపట్టిన ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నాలో ఫ్యాప్టో సభ్యసంఘాల కార్యకర్తలు పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఒపిఎస్ సాధన కోసం ఫ్యాప్టో ఆరెంచెల ఉద్యమ కార్యచరణను ప్రకటించిందని తెలిపారు. జిపిఎస్‌ను ప్రతిఘటిస్తూ పాత పెన్షన్ తప్ప మరే ప్రత్యామ్నాయం తమకు ఆమోదయోగం కాదని ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ భావిస్తున్నాయని పేర్కొన్నారు. ఎపిసిపిఎస్ఇఎ ప్రకటించిన కార్యక్రమానికి ఫ్యాప్టోను మద్దతు కోరిందని, ఉమ్మడి సమస్య కాబట్టి తాము కూడా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు.

టిటిడికి వాహనం విరాళం

ప్రజాశక్తి - తిరుమల

బెంగళూరుకు చెందిన కోదండ రెడ్డి గురువారం రూ.14 లక్షల విలువైన ఫోర్స్ ట్రావెలర్ వాహనాన్ని శ్రీవారికి విరాళంగా ఇచ్చారు. శ్రీవారి ఆలయం ఎదుట పూజలు నిర్వహించి, వాహనం తాళాలను, డాక్యుమెంట్స్‌ను ఇఒ ఎవి ధర్మారెడ్డికి దాత అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల డిఇ జానకిరామిరెడ్డి, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల వద్ద 36 గంటల ధర్నా

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుబ్బరావమ్మ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లా కలెక్టరు కార్యాలయాల వద్ద 36 గంటలపాటు నిరవధిక ఆందోళన నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ వెల్లడించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అఖిలభారత కోర్కెల దినం సందర్భంగా 10న బ్లాక్ డే నిర్వహించాలని అఖిలభారత కమిటీ నిర్ణయించిందని, ఈ మేరకు ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాకు సంబంధించిన పోస్టరును విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ నాయకులతో కలిసి గురువారం సుబ్బరావమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని కోరారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ విద్యను బలోపేతం చేసి పిల్లలకు యునిఫాం ఇచ్చి అమ్మఒడి అమలు చేయాలని కోరారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని అన్నారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. పర్యవేక్షణ పేరుతో అంగన్వాడీలను ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, ఎంఆర్ఒ, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు అవమానిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులోని హనుమాయమ్మను రాజకీయ కక్షతో నిర్ధాక్షణ్యంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రేడ్-2 సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని కోరారు. 2022లో పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టుల్లో మిగిలిన 164 వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ సుప్రజ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ వేమేశ్వరి, జయని, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 'భవిష్యత్ గ్యారంటీ' పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర సందర్భంగా ఆయన గొల్లప్రోలులో విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోడీ, అమిత్ షాలను సిఎం జగన్ కలిశారని, తరువాత పాడిన పాటే మళ్లీ పాడుతున్నారని ఎద్దేవా చేశారు. కానీ వాస్తవ పరిస్థితులు చూస్తే నాలుగేళ్ల పాలనలో సిఎం అన్ని రంగాల్లో విఫలమయ్యారని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైసిపి ఓటమి ఖాయమని ఐ-ప్యాక్ సర్వే కూడా తేల్చేసిందన్నారు. దీంతో జగన్ ఢిల్లీకి పరుగుపెట్టి ముందస్తు ఎన్నికల కోసం ప్రాధేయపడ్డారని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కోవడానికి టిడిపి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్టు అంబటి ఆంజనేయులుకు నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

అంబటి సేవలు స్ఫూర్తిదాయకం

- కుటుంబ సభ్యులకు వి శ్రీనివాసరావు పరామర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జర్నలిస్టు ఉద్యమంలో అంబటి ఆంజనేయులు సేవలు స్ఫూర్తిదాయకమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన సీనియర్ జర్నలిస్టు, ఐజెయు నాయకులు అంబటి ఆంజనేయులు కుటుంబాన్ని గురువారం ఉదయం విజయవాడ బావాజీపేటలోని వారి నివాసంలో ఆయన పరామర్శించారు. తొలుత ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సంజయ్, సంతోష్, ఆంజనేయులు సోదరులు అంబటి సుబ్బారావు తదితరులను కలిసి సానుభూతి తెలిపారు. తన పాదయాత్రకు ముందు జరిగిన మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారని, ఇంతలో హఠాన్మరణం చెందుతారని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణ సమయంలో పోలవరం పాదయాత్రలో ఉన్న నేపథ్యంలో రాలేకపోయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జర్నలిస్టు ఉద్యమంలో అంబటి ఆంజనేయులు నిర్వహించిన పాత్ర మరువలేనిదని, వారి హక్కుల కోసం జరిగే పోరాటంలో ముందున్నారని, ఎంత పెద్ద బాధ్యతల్లో ఉన్నా అందరినీ ఆత్మీయతతో పలకరించేవారని, అటువంటి వ్యక్తి మరణం జర్నలిస్టు ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచల జయరాజు, విజయవాడ అర్బన్ అధ్యక్షులు చావా రవి, సీనియర్ జర్నలిస్టు వల్లభనేని సురేష్, ఐజెయు సభ్యులు ఎస్‌కె బాబు, ఫొటో జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు సాంబశివరావు, అంబటి సన్నిహితులు రంగారావు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో గురువారం మున్సిపల్ కార్మికుల ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పనిచేసే వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఇంజనీరింగ్, నీటి సరఫరా కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ జీతాలు, యుజిడి కార్మికులకు హెల్త్ అలవెన్సులు, మిగిలిన కేటగిరీలకు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే మరోసారి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. టి నూకరాజు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.రాజు, నాయకులు నాయుడు, శంకరరావు, బలరాం, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పిఎల్ఆర్ ప్రసాదరావుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి- ఒంగోలు

వ్యాపారవేత్త పంగులూరు ప్రసాదరావు అంత్యక్రియలను ఆయన కుటుంబసభ్యులు గురువారం నిర్వహించారు. ఒంగోలులోని చెన్నకేశవ నగర్ నుంచి ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర సాగింది. కన్నీటి వీడ్కోలు నడమ మహాప్రస్థానంలో అంత్యక్రియలు ముగిశాయి. ముందుగా ప్రసాదరావు భౌతికకాయం వద్ద ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, ప్రజాశక్తి, నవ తెలంగాణ దినపత్రికల బృందంతోపాటు సిపిఎం నాయకులు పూనాటి ఆంజనేయులు, సిపిఐ నాయకులు రావుల వెంకయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వైవి.సుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. ప్రసాదరావు సోదరుడు, నవ తెలంగాణ దినపత్రిక సిజిఎం ప్రభాకర్‌ను, ప్రసాదరావు కుటుంబసభ్యులను వారు పరామర్శించారు.



నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్

ఆప్కాస్ ఉద్యోగుల నిరసన

- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగానే తమనూ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కడప రిమ్స్ ఆస్పత్రి ఎదుట మోకాళ్లపై కూర్చుని అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సుదర్శన్ మాట్లాడారు. పనిచేసే విధానంలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఆప్కాస్ ఉద్యోగులకు తేడా లేదని, వారికి చెల్లించే వేతనాల్లో తేడాలు ఎందుకని ప్రశ్నించారు. పర్మినెంట్ అయ్యేంత వరకూ సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల తల్లిదండ్రులకు వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లను, ఆప్కాస్‌లో పనిచేస్తూ వికలాంగులైన కార్మికుల పింఛన్లు కూడా రద్దు చేయడం దారుణమన్నారు. పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు భాస్కర్, బాలాజీ రావు, ఏసన్న, రామకృష్ణ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఆప్కాస్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు

పింఛన్లకు సింగిల్ విండో!

- ఇ-పేమెంట్లలో భారాన్ని పెంచొద్దు
- రాష్ట్రాలకు ఆర్‌బిఐ మార్గదర్శకాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగుల పింఛన్లకు సంబంధించి రాష్ట్రాలకు రిజర్వ్‌బ్యాంకు నుంచి సూచనలు వస్తున్నాయి. ఇ-చెల్లింపుల విధానంలో అనుసరించాల్సిన విధానాలు, పింఛన్ల చెల్లింపు పరిస్థితి వంటి అంశాలపై సూచనలు చేయడం విశేషం. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను ప్రస్తావిస్తూనే ఏవి చేస్తే బాగుంటుందన్న కోణంలో కూడా నివేదిక సిద్ధం చేసింది. అనేక రాష్ట్రాల్లో ఏజెన్సీ బ్యాంకుల ద్వారానే పింఛను చెల్లింపులు చేస్తుండగా, మరికొన్ని రాష్ట్రాల్లో నేరుగా రిజర్వ్‌బ్యాంకు ద్వారా, ఇంకొన్ని రాష్ట్రాల్లో ఖజానాల ద్వారా పింఛన్ల చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని మార్గదర్శకాలను కూడా రిజర్వ్‌బ్యాంకు సిద్ధం చేసింది. పింఛనుదారులకు టంఛనుగా పింఛను నగదు అందేలా చూడడంతోపాటు మొత్తం పింఛన్ల పంపకం ప్రక్రియకు ఒక సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలన్న కోణంలో సూచనలు చేసింది. పింఛన్ల సవరణ, కరువు భత్యం వంటివి ఎప్పటికప్పుడు అమలు చేయాల్సిన విధానం, పింఛనుదారులను గుర్తించేందుకు డిజిటల్ విధానం అమలు ద్వారా డూప్లికేషన్ నివారణ, అధిక, తక్కువ పింఛన్లను అందించడంలో తేడాను తగ్గించడం, పింఛనుదారుల సమస్యను నివారించేందుకు గ్రీవెన్స్ మేనేజ్‌మెంటు అమలుపైనా సూచనలు చేసింది.



'స్పార్ష్' విధానంపైనా..

పింఛన్ల చెల్లింపులో రక్షణశాఖ స్పార్ష్ అనే విధానాన్ని అమలు చేస్తోంది. అలాగే టెలీ కమ్యూనికేషన్ శాఖ కూడా తన శాఖలో సొంతంగా తయారుచేసుకున్న సంపన్న అనే విధానాన్ని అమలు చేస్తోంది. వీటిని ఒకే ప్లాట్‌ఫారంపై చెల్లింపులు చేస్తుండడంతో సత్ఫలితాలు వస్తున్నట్లు భావిస్తున్న రిజర్వ్ బ్యాంకు అదే తరహా చెల్లింపుల అమలుపైనా ఆలోచనలు చేస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో పింఛను చెల్లింపులకు సంబంధించి అనేక ఫైళ్లను ఒకే ఇ-పేమెంట్ ఫైలులో పంపిస్తున్నట్లు రిజర్వ్‌బ్యాంకు గుర్తించింది. సాధారణంగా ఒక ఇ-పేమెంట్ ఫైల్‌లో 50 ట్రాన్సాక్షన్ల కన్నా ఎక్కువ పంపిస్తే సమస్యలు వస్తాయని రిజర్వ్‌బ్యాంకు భావిస్తోంది. దీనివల్ల నెట్ ట్రాఫిక్‌లో కూడా అంతరాయాలు వస్తాయన్న భావాన్ని వ్యక్తం చేస్తున్న రిజర్వ్‌బ్యాంకు.. రాష్ట్రాలు ఆ తరహా భారీ ట్రాన్సాక్షన్లు తగ్గించుకోవాలని సూచించింది.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - రుద్రవరం (నంద్యాల)

ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన దంపతులు వెంకటేశ్వర్లు (32), శిరీష (26) వ్యవసాయ కార్మికులు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. శిరీషకు అరోగ్యం బాగోలేకపోవడంతో వైద్యానికి రూ.3 లక్షల వరకు అప్పు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి విషపు మందును శిరీష తాగారు. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆమె మృతిచెందారు. భార్య మరణ వార్త తెలుసుకున్న భర్త తన ఇంటిలోని పై కప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. శిరీష తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జెఐఎంఇఎక్స్ విన్యాసాలతో.. భారత్ - జపాన్ బంధం బలోపేతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

భారత్ - జపాన్‌ల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా జపాన్ - ఇండియా మారిటైమ్ ఎక్సర్‌సైజ్ (జెఐఎంఇఎక్స్-23)ను తలపెట్టామని ఇండియన్ నేవీ రియర్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్ తెలిపారు. భారత నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జెఐఎంఇఎక్స్-23 ఏడో ఎడిషన్ విన్యాసాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గురుచరణ్ సింగ్, జపాన్ నేవీ అడ్మిరల్ నిశియమ టకహిరో ఐఎన్ఎస్ కమోర్టా నౌకలో సంయుక్తంగా గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. తొలుత గురుచరణ్ సింగ్ మాట్లాడుతూ.. ఈ నెల ఏడు వరకూ భూ ఉపరితలం, సముద్రం, ఆకాశంలో ఈ విన్యాసాలు కొనసాగుతాయన్నారు. ఇండియన్ నేవీకి చెందిన ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ కమోర్టా, దేశీయంగా తయారైన యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ కార్వెట్, ఫ్లీట్ ట్యాంకర్, ఐఎన్ఎస్ శక్తి, సముద్ర గస్తీ విమానం పి-81 డోర్నియర్, పలు యుద్ధ విమానాలు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయని వివరించారు. నిశియమ టకహిరో మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి, సముద్ర భద్రతను పటిష్టం చేసుకోవడానికి ఈ విన్యాసాలు తోడ్పడతాయన్నారు. స్నేహబంధం మరింత బలపడుతుందని తెలిపారు.



ఎపిజిబి ఆర్ఎం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ కార్యాలయాన్ని ఆ బ్యాంకు చైర్మన్ రాఖేష్ కాశ్యప్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని మొత్తం 50 శాఖల పర్యవేక్షణ మార్కాపురం రీజనల్ ఆఫీసు ద్వారా జరుగుతుందని తెలిపారు. రుణ వితరణ సులభతరం చేసేందుకు వీలుగా సరళ రుణ కేంద్రం అనే వ్యవస్థను సైతం గురువారం ప్రాంతీయ కార్యాలయ ఆవరణలో ప్రారంభించామన్నారు. తమ బ్యాంకు వ్యాపార నిర్వహణ కాకుండా సామాజిక బాధ్యతగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలనూ ఖాతాదారులకు విరివిగా అందజేస్తున్నట్లు తెలిపారు. 14 మంది ఖాతాదారులకు విద్య, గృహ నిర్మాణం, పాడి పరిశ్రమ, ట్రాక్టర్ కొనుగోలు, వాహన కొనుగోలు కొరకు రూ. మూడు కోట్ల రుణాలను రాఖేష్ కాశ్యప్ అందించారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, సీనియర్ మేనేజర్ సంతోష్ వందన, ఒంగోలు, మార్కాపురం రీజినల్ మేనేజర్లు హేమలత, ఇ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

మెటా థ్రెడ్స్ వచ్చేసింది..

- ఏడు గంటల్లో కోటి మంది చేరిక

వాషింగ్టన్ : సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్‌కు పోటీగా మెటా తన థ్రెడ్స్‌ను తీసుకువచ్చింది. దీన్ని విడుదల చేసిన ఏడు గంటల్లోనే కోటి మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. మెటా థ్రెడ్స్ యాప్ యూరోపియన్ యూనియన్‌లోని కొన్ని దేశాల్లో తప్ప ప్రపంచంలోని దాదాపు 100కి పైగా దేశాల్లో గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్‌లో 500 అక్షరాల వరకు పోస్ట్ చేయవచ్చు. ట్విటర్ తరహా ఫీచర్లతో అదనంగా కొన్ని జోడించింది. ఇన్‌స్టాలో అనుసరిస్తున్న ఖాతాలను, కొత్త యాప్‌పైనా అనుసరించే సౌలభ్యం ఉంది. ఇందులో ట్విటర్‌లో లేని కొన్ని అదనపు ఫీచర్స్ కూడా ఉన్నాయి. ఈ యాప్ వినియోగించాల నుకునే వారు ఇప్పటికే ఉన్న ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా లాగిన్ అవ్వొచ్చు. ఇన్‌స్టా గ్రామ్‌లో ఫాలో అవుతున్న అందరూ ఇందులో కూడా ఫాలో అయ్యే అవకాశం ఉంది.

అత్యంత సంపన్నులు ఐదు రెట్లు పెరగొచ్చు : రిపోర్ట్

న్యూఢిల్లీ : దేశంలో అత్యంత సంపన్నులు భారీగా పెరుగొచ్చని ఓ రిపోర్ట్ తెలిపింది. అదే విధంగా మధ్యతరగతి వర్గం పెరుగుతుందని పేర్కొంది. 2031 నాటికి పేదలు సగానికి తగ్గొచ్చని పీపుల్స్ రీసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ అండ్ ఇండియన్ సిటిజన్ ఎన్విరాన్‌మెంట్ పేర్కొంది.

25 రాష్ట్రాల్లో 40,000 కంటే ఎక్కువ మంది వ్యక్తుల అభిప్రాయాలతో ఈ రిపోర్ట్‌ను రూపొందించినట్లు వెల్లడించింది. వచ్చే తొమ్మిదేళ్లలో ధనవంతుల కుటుంబాలు 91 లక్షలకు చేరొచ్చని అంచనా వేసింది.

మరోవైపు అత్యంత సంపన్న కుటుంబాల్లో ఐదు రెట్ల పెరుగుదల ఉండొచ్చని తెలిపింది. 2021 నాటికి సంవత్సరానికి రూ.2 కోట్ల కంటే ఎక్కువ సంపాదిస్తున్న అత్యంత ధనవంతుల కుటుంబాల సంఖ్య ఐదేళ్లలో 18 లక్షలకు చేరి.. రెట్టింపు కావొచ్చని అంచనా వేసింది. గ్రామాల్లో ధనవంతుల కుటుంబాల వృద్ధి 14.2 శాతంగా, నగరాల్లో 10 శాతం ఉండొచ్చని పేర్కొంది.

దక్షిణాదిలో టికెఎం 'మాన్‌సూన్ క్యాంపెయిన్'

బెంగళూరు : తమ వినియోగదారులకు ఇబ్బంది లేని ప్రయాణాన్ని కల్పించడానికి మాన్‌సూన్ క్యాంపెయిన్‌ను చేపడుతున్నట్లు టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) తెలిపింది. ఈ వర్షాకాలంలో 20పాయింట్ల సమగ్ర వాహన ఫిట్‌నెస్ తనిఖీ నుండి ఇంటి వద్దనే సేవలు అందించటం వరకూ విస్తృత శ్రేణి సేవలు అందించనున్నట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇతర దక్షిణాది రాష్ట్రాల్లోని తమ సర్వీసు సెంటర్లలో ఆకర్షణీయ సర్వీసింగ్ ప్యాకేజిలు అందిస్తున్నట్లు పేర్కొంది.

బాలికపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మూడో తరగతి చదువుతున్న బాలికపై 17 ఏళ్ల బాలుడు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. విజయనగరంజిల్లా పూసపాటిరేగ మండలంలోని పతివాడ గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలిక మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో మూత్ర విసర్జనకు పాఠశాల వెనుక వైపు ఉన్న పొలంలోకి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన బాలుడు కొబ్బరికాయ ఇస్తానంటూ ప్రలోభ పెట్టి సమీపంలో ఉన్న కొబ్బరి తోటలోకి బాలికను తీసుకెళ్లి భయపెట్టి అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరించి పంపించేశాడు. ఇంటికి వెళ్లి మూత్ర విసర్జనకు వెళితే కాలు జారిపడి గాయమై, రక్తస్రావం అవుతుందంటూ బాలిక తల్లికి చెప్పింది. వెంటనే తల్లి స్పందించి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల పరీక్ష చేసి పరిస్థితి విషమంగా ఉందంటూ విశాఖపట్నం కెజిహెచ్ తరలించారు. కెజిహెచ్‌లో వైద్యులు బాలికను పరీక్షించి అత్యాచారం జరిగినట్లు ధ్రువీకరించారు. ఏం జరిగిందని తల్లి ప్రశ్నించగా బాలిక జరిగిన విషయాన్ని తెలిపింది. వెంటనే వైద్యులు దిశ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై గురువారం పాఠశాలలో డిఎస్‌పి గోవిందరావు విచారణ జరిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మాట్లాడి ఘటన వివరాలను నమోదు చేశారు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో ఐడిఎఫ్‌సి విలీనం

న్యూఢిల్లీ : ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో ఐడిఎఫ్‌సి లిమిటెడ్ విలీనం అయ్యింది. ఇందుకు రెండు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడిఎఫ్‌సి వాటాదారులకు తమ వద్ద గల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు షేర్లు పొందనున్నారు. మౌలిక వసతుల రంగానికి మద్దతును అందించడానికి 1997లో ఐడిఎఫ్‌సిని ఏర్పాటు చేయగా.. ఆ సంస్థ తన అనుబంధంగా 2014 ఐడిఎఫ్‌సి బ్యాంక్‌ను ఏర్పాటు చేసింది. కాగా.. మాతృసంస్థనే తాను నెలకొల్పిన సబ్సిడరీలో విలీనం కావడం విశేషం. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌కు 2023 మార్చి నాటికి 809 శాఖలు, 925 ఎటిఎంలు ఉన్నాయి.

అదాని గ్రూప్‌లో తగ్గనున్న ప్రమోటర్ల వాటాలు

న్యూఢిల్లీ : నగదు లభ్యతను పెంచుకోవడానికి అదాని గ్రూప్ ప్రమోటర్లు తమ వాటాలను తగ్గించుకోవాలని భావిస్తోన్నారు. ప్రస్తుతం అదానీ గ్రూప్ లిస్టెడ్ సంస్థల్లో అదానీ గ్రీన్ ఎనర్జీ, ఎసిసి లిమిటెడ్ మినహా మిగిలిన కంపెనీల్లో అదానీ కుటుంబానికి 60 శాతానికి పైగా వాటా ఉంది. వాటిలోని వాటాలను తగ్గించుకోవాలని యోచిస్తున్నారని రిపోర్టులు వస్తోన్నాయి. హిండెన్‌బర్గ్ రిపోర్ట్ తర్వాత అదాని కుటుంబం పలు కంపెనీల్లోని తమ వాటాలను తగ్గించుకున్న విషయం తెలిసిందే. మరోమారు వాటాల తగ్గింపునపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వచ్చే నిధులతో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని యోచిస్తోన్నారు. గడిచిన కొన్ని నెలల్లో అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్‌కు పలు మార్లు 3 బిలియన్ డాలర్లు విలువైన వాటాలను విక్రయించిన విషయం తెలిసిందే.

సంపాదకీయం

సమస్యల్లో సర్కారు బడి

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2021-22 తరువాత ఏటా సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థుల చొప్పున తగ్గుతుండడం బాధాకరం. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగి 2021-22 విద్యాసంవత్సరంలో 45,60,041 మంది చదివారన్న విషయం ఆనాడు ఎంతో సంతోషం కలిగించింది. ఆ తరువాత కూడా అదే విధంగా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ పోతుందని పలువురు ఆశించారు. కానీ అందుకు భిన్నంగా 45,60,041గా ఉన్న విద్యార్థుల సంఖ్య 2022-23 నాటికి 39,96,064కు పడిపోగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటికి 36 లక్షలకు దిగజారిపోవడం నిరాశ కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా మౌలిక వసతులను కల్పించడంతోపాటు జగనన్న విద్యాకానుక పేరిట బూట్లు, బట్టలు, పుస్తకాలు అందిస్తోంది. స్మార్ట్ టివిలు అమర్చడంతోపాటు విద్యార్థులకు ట్యాబులు కూడా ఇస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. అయినా ప్రభుత్వ బడి కాదని వేలకు వేలు ఫీజులు కడుతూ పుస్తకాలు కొంటూ సామాన్యులు సైతం ప్రైవేటు బడి బాట పట్టడానికి కారణాలు కనుగొనడం అవసరం. అనంతరం సర్కారు దిద్దుబాటు చర్యలను చేపట్టాలి. ప్రజల్లో అపోహలు ఉన్నట్టయితే వాటిని నివృత్తి చేయాలి. ఏది ఏమైనా ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావడం ఎంతో అవసరం. అందుకు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వృద్ధి కావడం ఒక కొలబద్దగా ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల్లో విలీన ప్రక్రియ సర్కారు బడికి సమ్మెట పోటు వేసింది. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మూడు కిలోమీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో కలపడంతో విలీన పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్య 20లోపే ఉంది. ఆ పేరుతో ఆయా పాఠశాలలకు ఒక్క టీచర్‌నే కేటాయించింది. ఈ దెబ్బతో రాష్ట్రంలో సుమారు 14 వేల పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూల్స్‌గా మారాయి. రేషనలైజేషన్ జిఓ 117 పేరుతో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రభుత్వం మార్చింది. ప్రాథమిక పాఠశాలల్లో సబ్జెక్టులను బట్టి కాకుండా విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్లను ఇస్తుంది. 20 మంది ఉంటే ఒక టీచర్, 60 మంది ఉంటే ఇద్దరు టీచర్లంటోంది. గతంలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను కేటాయించిన విద్యాశాఖ ఈ సారి సెక్షన్లు బట్టి కేటాయించింది. విద్యార్థుల సంఖ్య 98లోపు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను రద్దు చేసింది. ఇటువంటి చర్యల మూలంగా ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి, ఉన్నవారిపై పని భారం కుడా పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అంతేగాక పాఠాలు బోధించడంతోపాటు మధ్యాహ్న భోజనం పథకం నమోదు, జెవికె కిట్ల నమోదు, అనేక యాప్‌లలో నమోదు చేయడం వంటి బోధనేతర పనులను కూడా టీచర్లే చూసుకోవాల్సి వస్తోంది. విలీన ప్రక్రియ వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరడం లేదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతుంటే ప్రభుత్వం మాత్రం పిల్లలు పుట్టే శాతం తగ్గుతోందని, అందుకే చేరే వారి సంఖ్య తగ్గుతోందని ఎదురు దాడి చేయడం తగదు.

రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లీషును ప్రోత్సహించడమే విద్యాభివృద్ధిగా భావిస్తున్న పరిస్థితి నెలకొంది. అందుకోసం తెలుగు మాధ్యమాన్ని లేకుండా చేయాలని తొలుత చూసి, కోర్టులతో సహా పలు వైపులనుండి వ్యతిరేకత రావడంతో ఆ తరువాత సెకండ్ రేట్ ట్రీట్‌మెంట్ ఇచ్చింది. పోనీ ఆ ఇంగ్లీషు భాషను గానీ మాధ్యమాన్ని గానీ పకడ్బందీగా బోధించేటువంటి చర్యలూ లేవు. ఇంకొకవైపు ఆన్‌లైన్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్లంటూ హడావుడి చేస్తోంది. ఇంగ్లీషు భాషా బోధన లోనూ ఒకసారి బెండపూడి విధానం అనీ తాజాగా టోఫెల్ అంటూ ఊదర గొడుతోంది. సబ్జెక్టు టీచర్ల కొరత ఉండనే ఉంది. గత నాలుగేళ్లుగా డిఎస్‌సి రిక్రూట్‌మెంట్ లేదు. మొత్తంగా చూస్తే ప్రభుత్వం చేస్తున్న మార్పుల మూలంగానే పాఠశాలల్లో టీచర్ల కొరత ఒకవైపు, బోధనా విధానాల్లో గందరగోళం మరోవైపు సర్కారు బడుల్లో ప్రధాన ఆటంకాలుగా మారిన పరిస్థితి ఏర్పడడం విచారకరం. ప్రభుత్వం వీటన్నిటినీ పరిశీలించి ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో, విద్యావేత్తలు, నిపుణులతో చర్చించి పాఠశాల విద్య గాడిన పడేందుకు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగేందుకు తగు చర్యలు చేపట్టాలి.

మహనీయుల మాట



పని ఆనందంగా ఉన్నప్పుడు జీవితం హాయిగా ఉంటుంది
పని ఒక విధి అయినప్పుడు జీవితం బానిసత్వం అవుతుంది

- మక్సీం గోర్కి
సుప్రసిద్ధ రచయిత

ప్రభుత్వాల నిర్లక్ష్యం - పోరు బాటలో అంగన్‌వాడీలు

ఉద్యమం



కె.సుబ్బరావమ్మ

దేశ భవిష్యత్తును నిర్దేశించేటటువంటి పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అనుబంధ పోషకాహారం అందించడం, ఆరోగ్య సలహాలిచ్చి, పిల్లల్ని బడికి అలవాటు చేసే లక్ష్యంతో ఐసిడిఎస్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ లక్ష్య సాధనలో అంగన్వాడీల కృషి అమోఘం. ప్రభుత్వ పథకాలు అమలు వివిధ రకాల సర్వేల్లో వీరిదే కీలక పాత్ర. దేశవ్యాప్తంగా 13. 6 లక్షల అంగన్వాడీ సెంటర్లో 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లు 10 కోట్ల మంది లబ్ధిదారులకు అనునిత్యం సేవలు అందిస్తున్నారు. ఇలాంటి కీలకమైన బాధ్యతలు నిర్వహించే అంగన్వాడీలకి ఉద్యోగ భద్రత కరువాయె. ఈ పరిస్థితుల్లో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆలిండియా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 10, 11 తేదీలలో 36 గంటల పాటు ఏకబిగిన ధర్నా చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది

ఒక అంచనా ప్రకారం ప్రపంచంలో 80 శాతం బాలలు కటిక దారిద్ర్యంలో మగ్గుతున్నారు. యునిసెఫ్ నివేదిక ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు 122 మంది బాల్య దశలోనే చనిపోతున్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి ప్రభావం బాలల భవిష్యత్తుపై తీవ్రంగా చూపుతున్నది. ప్రపంచ ఆరోగ్య నివేదిక ప్రకారం రెండున్నర కోట్ల మంది బిడ్డలు పుడితే వారిలో సుమారు 13 లక్షల మంది 28 రోజుల్లోనే చనిపోతున్నారు.

కేంద్రంలో బిజెపి అధికారంలో కొచ్చేముందు ఐసిడిఎస్‌ని బలోపేతం చేస్తామని చేసిన వాగ్దానాన్ని విస్మరించి 9 సంవత్సరాలుగా ఐసిడిఎస్ పథకానికి కేటాయింపులపై కోత పెడుతూ వస్తోంది. వేదాంత, ప్రథమ, వంటి స్వచ్ఛంద సంస్థలకు అంగన్వాడీ సెంటర్ల పర్యవేక్షణ బాధ్యతను అప్పగించింది. ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేసింది. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా 2020లో నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. దీనికి మన రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వత్తాసు పలుకుతూ 172 సర్క్యులర్‌ను తీసుకొచ్చింది. అంగన్‌వాడీ సెంటర్లను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేయాలని, పిపి1, పిపి2 ప్రారంభించాలని, ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చాలని రకరకాల జిమ్మిక్కులు చేస్తోంది. అంగన్‌వాడీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో కొంత వెనక్కి తగ్గినట్లు కనిపించినా తన ప్రయత్నం మానుకోలేదు. విలీనాల సర్క్యులర్‌ను రద్దు చేయలేదు.

ప్రపంచంలో భారతదేశం ఆకలి మరణాల సూచీలో 107వ స్థానానికి దిగజారింది. అయినా 2023-24 కేంద్ర బడ్జెట్‌లో ఆహార భద్రతకి రూ. 90 వేల కోట్ల మేర కోత పడింది. పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు ఉపయోగపడుతున్న ఐసిడిఎస్ పథకానికి నామమాత్రంగా రూ.20, 554.31 కోట్లు కేటాయించారు. ఇది ఏమూలకూ చాలదు. 2017 నుండి టిఎ బిల్స్ ఇవ్వలేదు. సెంటర్ల నిర్వహణకు అంగన్‌వాడీలే పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు.



దేశవ్యాప్తంగా 13. 6 లక్షల అంగన్వాడీ సెంటర్లో 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లు 10 కోట్ల మంది లబ్ధిదారులకు అనునిత్యం సేవలు అందిస్తున్నారు. ఇలాంటి కీలకమైన బాధ్యతలు నిర్వహించే అంగన్వాడీలకి ఉద్యోగ భద్రత కరువాయె.

లబ్ధిదారుల లిస్టులు తగ్గించటానికి పోషణ ట్రాకర్ యాప్‌ను తీసుకొచ్చారు. ఆధార్‌ను లింక్ చేశారు. దాదాపు 30శాతం చిన్న పిల్లలకి ఆధార్ కార్డుల్లేవు. ఆధార్ కార్డులు తీసుకోవాలని అంగన్వాడీల మీద ఒత్తిడి పెంచారు. అంగన్‌వాడీలకు ఎటువంటి ట్రైనింగ్ లేకుండానే ఆన్‌లైన్ పని ప్రారంభించారు. ఫోన్‌లు పని చేయక పోవడం, ఆన్‌లైన్ వర్క్ చేయడానికి అవసరమైన నెట్ సిగ్నల్స్ లేకపోవటం వలన మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారు.

ప్రభుత్వ విధానాల వలన పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలను పెంచాల్సి ఉంది. కానీ, 2011 నుండి కేంద్రప్రభుత్వం ఒక్క పైసా కూడా పెంచలేదు. అంగన్‌వాడీలు పోరాటాల ఫలితంగా 2018లో మోడీ దీపావళి కానుకగా వర్కర్‌కి 1,500, హెల్పర్‌కి 750, మినీలకి 1,250 రూ. వేతనాలు పెంచుతానని దీపావళి కానుకగా ప్రకటించింది. కానీ, ఇంతవరకు అది అమలుకునోచుకోలేదు. 2022 ఏప్రిల్ 25న సుప్రీంకోర్టు అంగన్వాడీ ఉద్యోగులు 1972 చట్టం ప్రకారం గ్రాట్యుటీకి అర్హులే అని ఇచ్చిన తీర్పును అమలు చేయట్లేదు.

తెలంగాణా కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామన్న హామీ నిలబెట్టుకోవాలి

తెలంగాణా కన్నా అదనంగా వెయ్యి రూపాయలు వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటి మీద రాతగానే మిగిలిపోయింది. 2021 పిఆర్‌సి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీలకు 30 శాతం వేతనాన్ని పెంచింది. మాట తప్పను-మడమ తిప్ప నన్న ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ మార్చి 20 'ఛలో విజయవాడ'కు వచ్చిన అక్క, చెల్లెమ్మలను అవమానించే విధంగా ఇళ్లకు పోలీసులను పంపారు. తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. ఇన్ని నిర్బంధాల మధ్య కూడా వేలాదిమంది విజయవాడకు వచ్చి గళమెత్తారు, అంగన్‌వాడీల ఆవేదనను పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీశారు. అంగన్‌వాడీలతో మాట్లాడి సమస్యల పరిష్కరిస్తామని ఆ సందర్భంగా ఐసిడిఎస్ మంత్రి ఇచ్చిన హామీ నేటికి అమలుకాలేదు. పక్కనే ఉన్న కర్ణాటక, గుజరాత్ లో గ్రాట్యూటి అమలుచేస్తున్నారు. తమిళనాడులో బేసిక్ అమలుచేస్తున్నారు. ఇటీవల కాలంలో మహారాష్ట్ర హర్యానా తదితర రాష్ట్రాల్లో వేతనాలు పెరిగాయి. కానీ మన రాష్ట్రంలో పెరగలేదు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ, మెనూ చార్జీలు పెంచాలి

ముఖ్యమంత్రి మానస పుత్రికని కొండంత రాగం తీస్తూ గర్భిణీలు, బాలింతలకు సెంటరులో వేడి వేడిగా ఆహారాన్ని అందించాలని 'వైయస్సార్ సంపూర్ణ పోషణ' పథకాన్ని ప్రారంభించారు. ఏ రోజు ఏమి వండి పెట్టాలో మెనూ తయారు చేశారు. గర్భిణీలు బాలింతలకు ఇస్తున్న ఆహారం సరిపోవటం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా కేటాయింపులు పెంచలేదు. గర్భిణీ, బాలింతలకు 125 గ్రాముల బియ్యం, 16 గ్రాముల నూనె, 30 గ్రాముల కందిపప్పు, కూరగాయలు, పోపు సామానులకు కలిపి ఒక్కొక్కరికి 1.40 పైసలు, గ్యాసుకు 0.50 పైసలు మాత్రమే ఇస్తున్నారు. పిల్లలకు ఒక్కొక్కరికి 75గ్రాముల బియ్యం, 5 గ్రాముల నూనె, 15గ్రాములు కందిపప్పు, గ్యాస్‌కు 50 పైసలు ఇస్తున్నారు. కనీసం రోజుకి సెంటర్లో 20 మంది గర్భిణీలు, బాలింతలకు వేడి వేడి ఆహారం అందించడానికి గ్యాస్‌కు ఇస్తున్నది రూ.10.00/- లు మాత్రమే. నెలకు రూ.250 వస్తాయి. కూరగాయలు, చింతపండు, కారం, ఉప్పు, పోపుదినుసులు అన్నింటికీ కలిపి రోజుకు రూ.28 నెలకు రూ. 700 ఇస్తారు. 2017 నుండి టీఏ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సెంటరు అద్దెలు 4 నెలల నుండి ఇవ్వడం లేదు. నెలనెలా వేతనాలు వచ్చే పరిస్థితి లేదు. సెంటర్ల నిర్వహణకు అధిక వడ్డీలకి అప్పులు తెచ్చి నడపటంవల్ల అంగన్వాడీలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

సంక్షేమ పథకాలు అమలుచెయ్యాలి

అందరికీ బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నానని ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారు. అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, అతి తక్కువ వేతనం ఇస్తారు. సంక్షేమ పథకాల దగ్గరకొచ్చేసరికి మీరు సిఎఫ్ఎంఎస్‌లో వేతనాలు తీసుకుంటున్నారు కాబట్టి ఆ పథకాలకు మీరు అర్హులు కారని చెబుతున్నారు. అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు కూడా అమలు చెయ్యట్లేదు. వికలాంగులు, వితంతువులకూ ఇవ్వడం లేదు. రిటైరయిన హెల్పర్‌కు రూ. 20 వేలు, వర్కరుకు 50 వేలు మాత్రమే ఇస్తున్నారు. పెన్షన్ లేదు. వృద్ధులకు ఇస్తున్న పెన్షన్ కూడా ఇవ్వడం లేదు. పదవీ విరమణ వయసును ఉద్యోగులందరికీ 62 సంవత్సరాలకు పెంచినా అంగన్వాడీలకు మాత్రం పెంచలేదు.

హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలి : అంగన్వాడీ సెంటర్‌కి వచ్చే ప్రీ స్కూల్ పిల్లలకు అమ్మ తరువాత అమ్మలా హెల్పర్లు అనేక సేవలుఅందిస్తున్నారు. అదే సెంటర్లో ఖాళీ అయితే హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని జీవో ఉంది. కానీ జీవోని అమలు చేయకుండా కొన్నిచోట్ల రాజకీయ నాయకులు అధికారులు అడ్డుపడుతున్నారు. కుప్పం ప్రాజెక్టులో దాదాపు పది మంది హెల్పర్లకు ప్రమోషన్ అర్హత ఉన్నప్పటికీ ప్రమోషన్ ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. పార్వతీపురంలో ప్రమోషన్ ఇచ్చినా కూడా జాయిన్ కాకుండా రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారు. చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం సహా అనేక జిల్లాల్లో ప్రమోషన్లు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో రాజకీయ జోక్యం అరికట్టాలని కోరుతున్నాం.

మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

రాష్ట్రంలో 5,605 మినీ సెంటర్లు నడుస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో, మారు మూల గ్రామీణ ప్రాంతాల్లో పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు మినీ వర్కర్లు సేవ చేస్తున్నారు. 400లోపు జనాభా ఉంటే మినీ సెంటర్లు నడవాలి. కానీ మన రాష్ట్రంలో 1,000, 1,200 మంది జనాభా ఉన్న అనేక ప్రాంతాల్లో మినీసెంటర్లుగానే నడుస్తున్నాయి. మినీ వర్కర్లకు కనీసం వేసవి సెలవులు ఇవ్వడంలేదు. ప్రమోషన్లు ఇవ్వాలని జీవో ఉన్నా కూడా అమలు కావట్లేదు. దీంతో మినీ వర్కర్లు అనేక ఇబ్బందులు పడు తున్నారు.

విజిట్ ల పేరుతో వేధింపులు ఆపాలి

అంగన్‌వాడీలకు ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచెయ్యటంలేదు. రకరకాల యాప్‌లు తెచ్చారు. పనిభారం పెరిగింది. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులోని హనుమాయమ్మను రాజకీయ కక్షతో నిర్దాక్షణ్యంగా చంపారు. కనీసం మట్టి ఖర్చులు ఇచ్చే దిక్కు కూడా లేదు. కృష్ణాజిల్లా పామర్రు ప్రాజెక్టులో అన్నపూర్ణ అనే అంగన్‌వాడీ వర్కర్‌ను వైసిపి నాయకులు వేదింపులు, సిడిపిఓ బలవంతంగా లెటర్ వ్రాయించుకున్న ఫలితంగా ఆత్మహత్య ప్రయత్నం చేసుకొని నేడు విజయవాడలో చికిత్స పొందుతున్నది. ఈ నేపథ్యంలో ఈ క్రింది అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10 , 11 తేదీల్లో 36 గంటలు (పగలు, రాత్రి) కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళనలను అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిన అవసరముంది.

డిమాండ్స్ :

1. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి.
2. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి ఇవ్వాలి.
3. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి.
4. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలి.వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలి.
5. హెల్పర్ల ప్రమోషన్‌లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలి. ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలి.
6. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి.
7. అంగన్‌వాడీ విద్యను బలోపేతం చెయ్యాలి. పిల్లలకి యూనిఫామ్, అమ్మఒడి అమలు చెయ్యాలి.
8. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలి. గ్యాసును ప్రభుత్వమే సరఫరా చెయ్యాలి.2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలి.
9. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, భీమా అమలుచెయ్యాలి.
10. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి, ఆయిల్,కందిపప్పు క్వాంటిటీ పెంచాలి.
11. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి,
12. హత్యకి గురైన హనుమాయమ్మ కుటుంబంలో ఒకిరికి ఉద్యోగం ఇవ్వాలి. నష్టపరిహారం చెల్లించాలి.
13. గ్రేడ్ II సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలి.2022 లో పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న గ్రేడ్ II సూపర్‌వైజర్ పోస్టులలో మిగిలిన 164 పోస్టులను వెంటనే భర్తీ చెయ్యాలి.

(వ్యాస రచయిత అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

ఈ రోజు అవార్డులు, రేపు విజ్ఞాన శాస్త్రాన్నే నిషేధిస్తారు!

వ్యాఖ్య



డాక్టర్ దేవరాజు మహారాజు

భారత ప్రభుత్వం వారి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మూడు ముఖ్యమైన సైన్స్ అకాడెమీలకు నిధులు సమకూరుస్తుంది. అవి

1. **ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడెమీ** (INSA)
2. **నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా** (NASI)
3. **ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ (ఐఎఎస్)** (IAS)

ఈ మూడూ స్వయం ప్రతిపత్తి గల సంస్థలు. ఈ దేశ ప్రజలకు ఉపయోగకరమైన పరిశోధనలు చేయడం వీటి ధ్యేయం!అంతే కాదు, దేశంలో ఉత్తమ పరిశోధనలు చేస్తూ, సమాజానికి మేలు చేస్తున్న శాస్త్రజ్ఞుల్ని గుర్తించడం, వారికి అవార్డులు ప్రకటించి ప్రోత్సహించడం వీటి ఉద్దేశం. ఇందులో మూడవది ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ (IAS) అవార్డులు ప్రకటించదు. కాని, మొదటి రెండు దేశ వ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక, విద్య, ఆరోగ్య రంగాలలో కొన్ని వందల సంఖ్యలో ప్రతి యేటా అవార్డులు ప్రకటిస్తుంది.

పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల సిలబస్‌లోంచి వైజ్ఞానిక విషయాలు, చారిత్రక అంశాలు తొలగించి తమ హిందూత్వ ఎజెండాను అమలు పరచాలనుకుంటున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 'విజ్ఞాన్ ప్రసార్' లాంటి గొప్ప వైజ్ఞానిక సంస్థను కూడా మూసేసింది. అంటే వైజ్ఞానిక స్పృహకు దేశంలో తలుపులు మూసేసింది. వీటన్నిటిని ప్రారంభించి, ప్రోత్సహించింది భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గనక, ఆయనపై ఉన్న వ్యక్తిగత కక్ష కారణంగానే వైజ్ఞానిక సంస్థలు మూసివేయడం, వాటికి ప్రతి యేటా ఇవ్వాల్సిన నిధులు అందివ్వకపోవడం చేస్తున్నారేమో - ఇటీవల జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియం పేరు మార్చి - పి.యం. మ్యూజియం అని ప్రకటించడం మనకు తెలుసు. ఎలాగైనా సరే ఎక్కడా నెహ్రూ పేరు వినిపించకుండా చేయాలని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టుగా ఉంది. ఇంతటితో ఆగకుండా ప్రతి యేటా శాస్త్ర వేత్తలకు ఇచ్చే అవార్డులను కూడా రద్దు చేసింది. 2022లో సుమారు 300సైన్స్ అవార్డులను రద్దు చేసిన శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ, ఈ సంవత్సరం మరో 92 సైన్స్ అవార్డుల్ని రద్దు చేసింది. ఇలాంటి విషయాలకు పత్రికలు, మీడియా విస్తృత ప్రచారమివ్వవు. అందువల్ల సామాన్య జనానికి విషయాలు తెలియవు.

కేంద్ర ప్రభుత్వ నిధులు అందుకుంటున్న అకాడెమీలు ఇచ్చే అవార్డులు ఇకపై కొనసాగించరాదని ఈ ఆరెస్సెస్-బీజేపీ ప్రభుత్వం భావిస్తుంది. యువ శాస్త్రవేత్తలు, సైన్సు టీచర్లు, లెక్చరర్లు, జాతీయ అంతర్జాతీయ స్థాయి కలిగిన సైంటిస్ట్‌ల కోసం వివిధ స్థాయిల్లో ఇస్తున్న పలు రకాల అవార్డులన్నీ ఇప్పుడు రద్దయిపోయాయి. తమకు దక్కాల్సిన గుర్తింపుల్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినందుకు వివిధ పరిశోధనాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో పని చేసే శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు అందరూ ఆందోళన పడటం, పెద్దఎత్తున తమ నిరసనలు తెలియజేయడం మామూలే! అయితే ఈ కేంద్ర ప్రభుత్వానికి ఎప్పుడు ఏ విషయంలో చీమ కుట్టింది గనుకా? గతంలో పద్మశ్రీలు, పద్మభూషణ్‌లు, సాహిత్య అకాడెమీ అవార్డుల్ని (అవార్డు వాపసీ) ప్రస్తుత ప్రభుత్వానికి తిప్పికొట్టినప్పుడే ఈ ప్రభుత్వం సిగ్గుపడలేదు. ఇక ఇప్పుడు పడాలని ఎందుకు అనుకుంటుందీ?



ఇక మిగిలింది ఒక్కటే... ఈ దేశంలో విజ్ఞాన శాస్త్రం ఎవరూ చదవగూడదు.. అని చట్టం తీసుకురావడమే! ఇంత చేసిన వారు ఇక ముందు అది కూడా చేయరని నమ్మకమేమిటీ? మన కేంద్ర ప్రభుత్వంపై మనకు తప్పకుండా నమ్మకముండాలి. కాబట్టి, వారు సులభంగానే ఈ కింది చట్టాలు తేగలరు.

- దేశంలో ప్రశ్న బతికి ఉండకూడదు.
- దేశంలో వైజ్ఞానిక స్పృహ ఉండకూడదు.
- భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరెత్తితే ఇకపై కఠిన శిక్షలు.
- గత జ్ఞాపకాలు ఎవరికీ ఉండకూడదు. ఎవరూ గత చరిత్రను తవ్వి తీయగూడదు.
- ప్రభుత్వం వారి 'మన్ కి బాత్' మాత్రమే విని చెవులు ఊపుతూ ఉండాలి.
- దేశంలో మేం ప్రజాస్వామ్యాన్ని గొప్పగా బతకనిస్తున్నాం... అని మన దేశ నాయకులు విదేశాల్లో చెప్పి వస్తుంటారు. వాటిని విని నోరుమెదపకూడదు. గమ్మున కూర్చోవాలి.
- మైనార్టీలను స్వంత బిడ్డల్లా చూసుకుంటున్నామని అంతర్జాతీయ వేదికల మీద మన నాయకులు ప్రసంగించి వస్తారు. మనమిక్కడ చప్పట్లు చరుస్తుండాలి.
- బేటీ బచావో బేటీ పడావో - నినాదాన్ని ప్రతి ఊర్లో సందుగొందుల్లో గొంతెత్తి నినదించాలి.
- దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున మహిళా క్రీడాకారుల మీద దౌర్జన్యం చేశారని తెలిసినా నోరు విప్పగూడదు.
- అమెరికా పర్యటనలో వైట్‌హౌజ్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో - భారతదేశంలో జరుగుతున్న హిందుత్వ అఘాయిత్యాల మీద, గుజరాత్ మానవ హననం మీద, జాతి వివక్ష మీద, అసమర్థ పాలన మీద విలేకరులు సంధించిన కేవలం రెండు ప్రశ్నలకు కూడా సమాధానమివ్వకుండా 'ప్రజాస్వామ్యం మా ఐచీూలో ఉందని' మన ప్రధాన నాయకుడు పిట్టకథ చెప్పి వచ్చిన అంశాన్ని ఎక్కడా ప్రస్తావించగూడదు.
- వాషింగ్టన్ డి.సి. ప్రధాన వీధుల్లో భారతదేశంలోని కేంద్ర ప్రభుత్వం మీద అక్కడి జనం విమర్శలు గుప్పిస్తుంటే మన ప్రధాన నాయకుడు నోరు మెదపకుండా నవ్వుతూ ఏడుపు మొహం వేసుకుని రాలేదా?
- భారతదేశంలో ప్రస్తుత హోమ్‌మంత్రి ఒక జడ్జిని చంపించిన క్రిమినల్ అని వాషింగ్టన్ వీధుల్లో తమ అధ్యక్షుడు బైడెన్‌కు వినపడేంతగా - మైకులు పగిలేట్లు వక్తలు ఉద్రేకంతో ఉపన్యసిస్తుంటే - దేశం వెలిగిపోతోందని... మన మిక్కడ మన్నుతిన్న పాముల్లా పడి ఉండాలా? వద్దా? ఉండాల్సిందే కదా?
- అమెరికా మాజీ అధ్యక్షుడు బబార్ ఒబామా ఒక ఇంటర్వ్యూలో భారత ప్రధానిని ఉద్దేశించి సంధించిన ప్రశ్నలు వినిపించినా వినపడనట్లే నవ్వుతూ చెయ్యి ఊపుతూ ఆయనగారు అక్కడ తిరగలేదా? అంత పెద్ద స్థాయిలో ఉన్నవాడికి లేని సిగ్గు - సామాన్య మానవులం మనకు ఎందుకబ్బా? పట్టించుకోవద్దు కదా? మన ఆరోగ్యం మనం కాపాడుకోవాలి. మన చర్మాన్ని మనమే మందంగా తయారు చేసుకోవాలి! తప్పదు మరి...

భారత ప్రధాని పర్యటనపై స్పందిస్తూ ముగ్గురు ప్రతిభావంతులైన ప్రముఖ అమెరికా సెనెటర్లు చెప్పిన విషయాలు చూద్దాం. ఇందులో మొదటి ఇద్దరు మహిళలు. చాలా తీవ్రమైన పదజాలంతో నేటి భారత ప్రభుత్వం పట్ల తమ అసహనాన్ని, ఆగ్రహాన్ని వెలిబుచ్చారు.

మానవ హక్కులకు విఘాతం కలిగిస్తూ, జర్నలిస్టులను హింసిస్తూ ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేసిన ఘనమైన చరిత్ర ప్రస్తుత భారత ప్రధానిది. **- కోరి బుష్.**

మానవ హక్కులకు తీవ్ర విఘాతం కలిగించిన వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ మనం గౌరవించకూడదు. **- ఒకసియో కోర్ట్జ్.**

ప్రధాని మోడీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను, స్వేచ్ఛాలోచనను ధ్వంసం చేసింది. ప్రతిపక్ష సభ్యుల మీద నేరాలు మోపింది. జైలు పాలు చేసింది. పౌర సంఘాల స్వేచ్ఛను హరించింది. తనను కలిసినప్పుడు అమెరికా అధ్యక్షుడు బైడెన్, తప్పక ఈ సమస్యల్ని భారత ప్రధానికి ఎత్తి చూపాలి! ప్రశ్నించాలి!!

- బెర్నీ శాండర్స్.

దేశంలో ఇన్ని ఘోరాలు జరుగుతున్నా, అమెరికా అధ్యక్షుడు ఎందుకంత ఘనంగా భారత ప్రధానిని ఆహ్వానించాడూ? అందులో ఉన్న రహస్యమేమిటీ? అంటే ఇరు దేశాల మధ్య ఉన్న లావాదేవీలు ముఖ్య కారణం - అంతకు మించి అక్కడ భారత ప్రధానికి వ్యక్తిగతంగా లభించిన గౌరవమేమీ లేదు.

- భారతదేశం మంచి కొనుగోలుదారు. ఆయుధాలు డ్రోన్లు అమ్మడంలో అమెరికాది అగ్రస్థానం. కొనుగోలు చేయడంలో ప్రపంచ దేశాల్లో భారత దేశానిది అగ్రస్థానం. మంచి కొనుగోలుదారుణ్ణి ఏ అమ్మకందారుడూ వదులుకోడు కదా?
- భారత్‌లో జరుగుతున్న అంతర్గత విషయాలను విమర్శిస్తూ - వ్యాపార పరంగా వచ్చే లాభాల్ని చెడగొట్టుకోవడం ఎందుకూ? అది అక్కడి ప్రభుత్వానికి నచ్చదు కదా?
- అమెరికాలో భారత సంతతి వారు ఎక్కువ. పైగా అక్కడ ముఖ్యభూమిక పోషిస్తున్నవారు కూడా ఎక్కువే. భారత ప్రధాని పట్ల బైడెన్ ప్రభుత్వం గౌరవంగా వ్యవహరించినట్లయితే భారత సంతతికి చెందిన అమెరికా పౌరుల నుండి బైడెన్ ప్రభుత్వానికి మద్దతు బలంగా ఉంటుంది కదా?
- అమెరికా అధ్యక్షుని నివాస భవనంలో అక్కడి విలేకరులు అడిగిన రెండే రెండు ప్రశ్నలకు భారత ప్రధాని నేరుగా సమాధానం చెప్పకపోయినా కూడా అక్కడి విలేకరులు విరుచుకుపడలేదు. కారణం అధ్యక్ష భవనంలోని ప్రొటోకాల్. అయితే టెలివిజన్‌లలో ప్రత్యక్షంగా చూసిన ప్రపంచ పౌరులంతా భారత ప్రధాని మేధోసంపత్తిని బేరీజు వేసుకునే ఉంటారు.
- దేశంలో అవార్డులు రద్దు చేసి, తగుదునమ్మా అని ఈజిప్టు వారిచ్చిన అవార్డు పుచ్చుకుని రావచ్చా? అలాంటి వారికి ఆ అర్హత ఉంటుందా? ఈ దేశ ప్రజలు ఆలోచించాలి. ఇటీవలి కర్నాటక ఎన్నికల్లో ప్రజాసంఘాలు నిర్వహించినపాత్ర గుర్తుతెచ్చుకుని, మతం అన్నవాణ్ణి మట్టి కరిపించాలి - అనే ధ్యేయంతో - దేశంలో అన్ని రాష్ట్రాల్లో ప్రజా సంఘాలు ఏర్పడాలి! జనచైతన్యానికి సమాయత్తం కావాలి!!

వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

ఎన్‌టిపిసి పర్యావరణంపై దృష్టి పెట్టేలా చూడాలి : ఎన్‌జిటి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఎన్‌టిపిసికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని పర్యావరణ ప్రభావంపై నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ (నీరి) అధ్యయన నివేదికను అమలయ్యేలా పర్యవేక్షించాలని కాలుష్య నియంత్రణ మండలికి చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించింది. పరవాడలోని ఎన్‌టిపిసి పర్యావరణ సమస్యలపై వేసిన పిటిషన్‌పై ఎన్‌జిటి బుధవారం తుది ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్‌టిపిసి పరిసరాల్లో పర్యావరణ సమస్యలు పెరగకుండా, గాలి, నీరు, భూమి కాలుష్య తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

ఇమ్రాన్ ఖాన్‌పై కొత్త అభియోగాలు

మొత్తంగా 150 కేసులు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై కొత్తగా మరికొన్ని అభియోగాలు నమోదయ్యాయి. రావల్పిండిలో మే 9వ తేదీన పాక్ ఆర్మీ జనరల్ ప్రధాన కార్యాలయంపై దాడి జరిపించడంతో తీవ్రవాద నిరోధక చట్టం కింద తాజాగా ఆయనపై మరో ఆరు కేసులు నమోదయ్యాయి. అంతకుముందు తీవ్రవాద నిరోధక చట్టం కింద నమోదైనవి మూడు కేసులు వున్నాయి. దీంతో గతేడాది ఏప్రిల్‌లో ఇమ్రాన్ ఖాన్ పదవీచ్యుతుడైనప్పటి నుంచి మొత్తంగా దేశవ్యాప్తంగా 150 కేసులను ఇమ్రాన్ ఎదుర్కొంటున్నారు. ఇమ్రాన్ ఖాన్‌పై అభియోగాలపై స్పందిస్తూ ఇవొక దుర్దినాలని ఆయన మద్దతుదారులు వ్యాఖ్యానించారు. సైనిక స్థావరాలపై దాడులు, మెట్రో స్టేషన్‌లో దహనం ఘటనతో సహా అన్ని కేసులను సంయుక్త దర్యాప్తు బృందాలు విచారిస్తున్నాయని పాకిస్తాన్ జియో న్యూస్ తెలిపింది. మే 9వ తేదీన ఇమ్రాన్‌ను అత్యంత నాటకీయంగా అరెస్టు చేసిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా హింస చెలరేగింది. దీంతో ఇమ్రాన్ ఖాన్ పార్టీ సమస్యలను ఎదుర్కొంటోంది.

దళిత, గిరిజనులపై దాడులు నివారించాలి

● గవర్నరుకు టిడిపి ఫిర్యాదు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నేతలు గవర్నరుకు ఫిర్యాదు చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ నజీర్ అహ్మద్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్‌సి, ఎస్‌టిల రక్షణకు రాజ్యాంగం కల్పించిన హక్కులు సాధించే దిశగా జోక్యం చేసుకోవాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం దుర్వినియోగం, అఘాయిత్యాలపై సమగ్ర విచారణకు ఓ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. వైసిపి ఎస్‌సిల విభాగం అధ్యక్షులు పంప్ ప్రకాశ్ రెడ్డి దళితులను అసభ్య పదజాలం, జుగుప్సాకరమైన రీతిలో అవమానపరుస్తున్నారని వివరించారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మరో నేత మహాసేన రాజేష్‌ను కులం పేరుతో తీవ్ర పదజాలం వాడారని పేర్కొన్నారు. సిబిఐ దర్యాప్తు చేసి కూడా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. గవర్నరును కలిసిన వారిలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఆ పార్టీ ఎస్‌సి సెల్ నాయకులు కె అఖిల్ తదితరులు ఉన్నారు.

రాజధానిలో ఇళ్ల పేరుతో మరో మోసం : అచ్చెన్నాయుడు

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లు కట్టించేస్తామనడం సిఎం జగన్ మోసాల పరంపరలో మరో అంకమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. అమరావతి ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం పేదలపై ప్రేమ కాదని, అమరావతిపై కక్ష అని ప్రజలందరికీ తెలుసునని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పేదలకు కట్టించిన లక్ష టిడ్కో ఇళ్లను నాలుగేళ్లుగా ఇవ్వలేదన్నారు. అమరావతి రాజధాని నగర పరిధిలో నిర్మించిన 5 వేలకు పైగా పేద ఇళ్లను ఇన్నాళ్లు ఎందుకు పంపిణీ చేయలేదో చెప్పగలరా? అని ప్రశ్నించారు.

ప్రజలను దోచుకుంటున్న వైసిపి నేతలు

● యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అవినీతిపై సిట్ వేస్తామని, అవినీతి సొమ్మును కక్కిస్తామని టిడిపి యువనేత నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అవినీతి వల్ల అనేక మంది రైతులు నష్టపోయారన్నారు. కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేటలో ఇసుక అక్రమంగా దోచేస్తున్నారని ఆరోపించారు. కనిగిరి రిజర్వాయర్‌లో మట్టివ్యాపారం, రూ. 84 కోట్లతో చేపట్టిన మదివేల కాలువలో 25 శాతం కమీషన్ పుచ్చుకున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ ద్వారా రూ.100 కోట్లు సంపాదించారన్నారు. 2019 ఎన్నికల్లో రూ.50 కోట్లు అప్పులుంటే ప్రస్తుతం రూ. 1500 కోట్లు సంపాదించారన్నారు. జ్యుడిషియల్ ఎంక్వైరీ వేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కోవూరులో భారీ మెజార్టీతో టిడిపిని గెలిపించాలన్నారు. వైసిపికి వడ్డీతో సహా చెల్లిస్తున్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన బెజవాడ గోపాలరెడ్డి ఇచ్చిన గడ్డ కోవూరు అని అన్నారు. లోకేష్ వెంట టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే శాఖలో 14/2 రూల్‌ను రద్దు చేయాలి

● రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైల్వే ఉద్యోగులకు మరణశాసనంగా మారిన రూల్ నెంబరు 14/2ను తక్షణం రద్దు చేసి, ఈ రూల్‌తో అకారణంగా తొలగించిన లోకో డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఉద్యోగులకు అకారణంగా తొలగించే 14/2 రూల్ నెంబరును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ గురువారం చేపట్టిన బ్లాక్ డే కార్యక్రమానికి సంపూర్ణ మద్దతును రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రకటించింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి మహంకాళేశ్వరరావు, వివిఎల్ నరసింహులు ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వేలో 14/2 రూల్‌తో తొలగించిన లోకో డ్రైవర్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్, ఇంజనీరింగ్, మెకానికల్, ఆపరేటింగ్ సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్స్ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పని ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాలకు ఖాళీ పోస్టులు, ప్రైవేటీకరణ విధానాలే కారణమని తెలిసినా రైల్వే బోర్డు అధికారులు అకారణంగా లోకో డ్రైవర్లను తొలగించడం సరైనది కాదని పేర్కొన్నారు. విధుల్లో లోకో డ్రైవర్లతో 10 నుంచి 12 గంటలు పనిచేయించు కుంటున్నారని, 8 గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైల్వేలో వివిధ విభాగాల ప్రైవేటీకరించే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పింఛను సవరణ కోసం పెన్షనర్ల పోరాటం

● 31న జిల్లా స్థాయిల్లో కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయాల ఎదుట ధర్నాలు
● ఆగస్టు 21 నుండి 25 వరకు జంతర్ మంతర్ వద్ద ఐదు రోజుల ధర్నా
● బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్ పెన్షనర్ల ఉమ్మడి ఫోరమ్



ఆందోళన చేస్తున్న బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్లు (ఫైల్)

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2017 జనవరి 1 నుండి 5 లక్షల మంది బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్ పెన్షనర్లకు వారి చట్టబద్ధమైన పెన్షన్ రివిజన్‌ను తిరస్కరించడాన్ని వ్యతిరేకంగా మూడు దశల ఆందోళన చేపట్టాలని బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్ పెన్షనర్ల ఉమ్మడి ఫోరమ్ పిలుపు ఇచ్చింది. ఆయా సంఘాల నేతలు కెజి జయరాజ్, డిడి మిస్త్రీ, జివిఆర్ జోగి, హెచ్ ఎస్ ఠాకూర్, ఆర్ కె ముద్గల్, వివి ప్రసాద్, ఆర్ పి శర్మ, రాజేంద్ర ప్రసాద్ గురువారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు.

నిరంతర ప్రయత్నాలు, పోరాటాల తరువాత 2022 అక్టోబర్ 17న టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని పింఛనుదారుల సంఘాలతో సమావేశాన్ని నిర్వహించిందని, ఈ సమావేశంలో పెన్షన్ రివిజన్ వేతన సవరణ నుండి వేరు చేయబడుతుందని, మూడో వేతన సవరణ కమిటీ ప్రకారం అమలు చేయబడుతుందని చెప్పారని, అయితే 15 శాతానికి బదులు జీరో పర్సెంట్ ఫిట్‌మెంట్ ఆఫర్‌ను పింఛనుదారుల సంఘాలన్నీ ఏకాభిప్రాయంతో తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. టెలికమ్యూనికేషన్స్ విభాగం తమ హామీలను ఉల్లంఘిస్తూ ఉద్దేశపూర్వకంగా ప్రక్రియను జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. గత 78 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ రివిజన్ ప్రయోజనాలను పొందకుండా వేలాది మంది పింఛనుదారులు మరణించారని తెలిపారు.

ఈ తప్పనిసరి పరిస్థితుల్లో జాయింట్ ఫోరమ్ జూలై 6న బ్లాక్ డే పాటించి మూడు దశల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. పింఛనుదారులు బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్, టెలికాం కార్యాలయాల ముందు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 15 శాతం ఫిట్‌మెంట్‌తో పెన్షన్ రివిజన్‌ను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కమ్యూనికేషన్స్ మంత్రికి వ్యక్తిగత లేఖలు పంపుతామన్నారు. జాయింట్ ఫోరమ్ జూలై 31న జిల్లా స్థాయిలో, కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయాల ఎదుట రోజంతా ధర్నా నిర్వహిస్తుందని తెలిపారు. డిమాండ్ నెరవేరకపోతే ఆగస్టు 21 నుండి 25 వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఐదు రోజుల ధర్నా నిర్వహించాలని కూడా నిర్ణయించినట్లు తెలిపారు.

నిందితులకు జీవిత ఖైదు విధించాలి

● జార్ఖండ్ హైకోర్టుకు తబ్రేజ్ అన్సారీ భార్య

న్యూఢిల్లీ : దాదాపు నాలుగేళ్ల క్రితం మూకదాడిలో హత్యకు గురైన తాబ్రేజ్ అన్సారీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో పది మంది నిందితులకు శిక్షా కాలాన్ని పెంచాలని తబ్రేజ్ అన్సారీ భార్య జార్ఖండ్ హైకోర్టులో అప్పీలు చేయనున్నారు. బుధవారం సెరైకెలాలోని అదనపు జిల్లా కోర్టు జడ్జి-1 అమిత్ శేఖర్ దోషులకు పదేండ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చిచ్చారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 304 కింద పది మంది నిందితులను దోషులుగా నిర్ధారించారు. అంతేకాకుండా, నిందితులందరికీ ప్రత్యేకంగా రూ.15,000 జరిమానాగా డిపాజిట్ చేయాలని ఆదేశించారు. అయితే, ఈ తీర్పుపై తబ్రేజ్ అన్సారీ తరపు న్యాయవాది అసంతృప్తిని వ్యక్తం చేశారు. "మేము సెక్షన్ 302 (హత్యకు సమానమైన నేరపూరిత నరహత్య) కింద శిక్ష విధించాలని డిమాండ్ చేశాం. అయితే కోర్టు దానిని తోసిపుచ్చింది. గాయపడిన బాధితుడు నాలుగు రోజుల తర్వాత మరణించాడని చేసిన అభ్యర్థనపై ఐపీసీలోని సెక్షన్ 304కు మార్చింది. హత్య చేయాలనే ఉద్దేశ్యంతో రాత్రంతా నిర్దాక్షిణ్యంగా కొట్టినందున మేము దానిపై హైకోర్టులో అప్పీల్ చేస్తాం" అన్నారు.

ఏ పనికైనా పైసలివ్వాల్సిందే..!

● డబ్బులివ్వకపోతే పెండింగే...
● కాసులిస్తే ఏదైనా రిజిస్ట్రేషన్
● నెలల వ్యవధిలోనే ఎసిబి వలలో మరో సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అవినీతి రహిత పాలన అందిస్తామని ప్రభుత్వం ఒకవైపు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో ఏ పనికైనా కాసులివ్వాల్సిందేనన్న చందంగా తయారయింది సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పనితీరు. సబ్ రిజిస్ట్రార్లు పోటీపడి ప్రజల నుంచి కాసులు గుంజుతున్నారు. వరుసగా అవినీతి నిరోధక శాఖ వలలో నెలల వ్యవధిలోనే అనంతపురంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు అవినీతి నిరోధక శాఖ అధికారుల చేతికి చిక్కారు. అనంతపురం రూరల్, అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ రెండు చోట్లా ఎసిబి అధికారులకు పట్టుబడటం గమనార్హం.

భూమి విలువను బట్టి వసూలు..

భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇది సబ్ రిజిస్ట్రార్ సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. ఏ పని జరగాలన్నా పైసలివ్వాల్సిందే. ఇవ్వకుంటే సక్రమమైందైనా ముందుకు కదలదు. డబ్బులిస్తే సరైంది కాకపోయినా పని జరిగిపోతుంది. అది కూడా ఆ ప్రాంతంలో బహిరంగ మార్కెట్‌లోనున్న ధర ప్రకారం డబ్బులు చెల్లించాలి. లేకపోతే అది పెండింగ్ రిజిస్ట్రేషన్‌లో పడిపోతుంది. ధర కుదిరితే నిషేధిత భూముల జాబితాలోనున్నా సరే పనైపోతుంది. చిన్నపాటి సవరణలున్నా కాసులివ్వాల్సిందే. దీంతో సామాన్య జనం భూముల సమస్య అంటేనే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. తాజాగా పట్టుబడిన అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణ మూర్తి కూడా దాన విక్రయంకు లక్షల్లో డిమాండ్ చేయడం గమనార్హం.

రైటర్లే ఆదాయ మార్గం

పత్రాలు రాసే రైటర్లే సబ్ రిజిస్ట్రార్లకు ప్రధాన ఆదాయ మార్గంగా ఉంటున్నారు. వారి ద్వారానే ఈ బేరసారాలు జరుగుతున్నాయి. దీనికితోడు సహాయకులను అటు రైటర్లు, ఇటు సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రత్యేకంగా నియమించుకుని వసూలు చేయడం జరుగుతోంది. అనంతపురంలో పట్టుబడిన రెండు కేసుల్లోనూ ఇదే స్పష్టంగా కనిపిస్తోంది. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రారు అల్లుడి వద్ద డబ్బులుండగా, తాజాగా పట్టుబడిన కేసులో రైటర్ సహాయకుడి వద్ద డబ్బు లభించింది. ఈ రకంగా తీసుకున్న డబ్బులను విధుల అయిపోయిన తరువాత టీ కేఫ్‌ల్లో పంపకాలు జరుగనున్నట్లు ఆరోపణలున్నాయి. కార్యాలయాల్లో అంతా సాఫీగా నడుస్తున్నట్టు కనిపించినా డబ్బుల వ్యవహారమంతా బయట కేఫ్‌ల్లో సాగుతుంటాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాగని సాగు

- ఇప్పటి వరకు 8 శాతమే
- లోటు వర్షపాతంతో ముందుకు పడని అడుగులు



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగు ఆశించిన రీతిలో ముందుకు సాగడం లేదు. లోటు వర్షపాతంతో విత్తనాలు వేసేందుకు అన్నదాతలు అడుగులు ముందుకు వేయడం లేదు. వరుసగా నష్టాలు మూటగట్టుకుంటుండడంతో విత్తనం విత్తాలా? వద్దా? అనే సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి.

వ్యవసాయమే ప్రధానంగా ఉన్న జిల్లాల్లో కర్నూలు జిల్లా ఒకటి. తొలకరి వర్షాలు ప్రారంభమైన దాదాపు నెల కావస్తున్నా ఇప్పటివరకు ఖరీఫ్ సాగుకు అడుగులు ముందుకు పడడం లేదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు సాధారణ సాగులో కేవలం 8.2 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 10,53,900 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 86,770 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. జూన్ నెలలో 77.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 46.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. వర్షాలు ఆశించిన రీతిలో కురవకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే పత్తి సాధారణ సాగు 6,25,067.5 ఎకరాలు కాగా ఇప్పటివరకు 65,155 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 10.4 శాతం పంట మాత్రమే సాగయింది. వర్షం లేకపోవడం వల్ల ఇప్పటికే పలు ప్రాంతాల్లో పత్తి చెట్లు ఎండిపోతున్నాయి. వేరుశనగ సాధారణ సాగు 1,66,407.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 10,755 ఎకరాల్లో మాత్రమే విత్తనాలు వేశారు. వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలు కాగా 30 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కంది సాధారణ సాగు 59,822.5 ఎకరాలు కాగా 2,520 ఎకరాల్లో, పొద్దుతిరుగుడు సాధారణ సాగు 1,490 ఎకరాలు కాగా 287.5 ఎకరాల్లో విత్తనాలు వేశారు. ఆముదం సాధారణ సాగు 20,357.5 ఎకరాలు కాగా 2,562.5 ఎకరాల్లో, మిరప సాధారణ సాగు 48,410 ఎకరాలు కాగా 1240 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉల్లి సాధారణ సాగు 38,582.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1267.5 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. టమోటా సాధారణ సాగు 5,257.5 ఎకరాలు కాగా 190 ఎకరాల్లో సాగు ప్రారంభించారు. ఇతర పంటల సాధారణ సాగు విస్తీర్ణం 29,175 కాగా 1,967.5 ఎకరాల్లో సాగు చేశారు.

చిరు ధాన్యాలపైనా ప్రభావం

లోటు వర్షపాతం ప్రభావం చిరు ధాన్యాల సాగుపైనా పడింది. జిల్లావ్యాప్తంగా సజ్జ సాధారణ సాగు 8,265 ఎకరాలు కాగా 165 ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకు సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు 10,810 ఎకరాలు కాగా 527.5 ఎకరాల్లో సాగు ప్రారంభించారు. కొర్ర సాధారణ సాగు 4,080 ఎకరాలు కాగా కేవలం 110 ఎకరాల్లో సాగు చేశారు.

విండీస్ గడ్డపై ప్రాక్టీస్ షురూ..



గయానా : ఈ నెల 12నుంచి భారత్, వెస్టిండీస్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుండగా.. ఇప్పటికే కరీబియన్ గడ్డపై అడుగుపెట్టిన రోహిత్ బృందం గురువారం నుంచి ప్రాక్టీస్ ప్రారంభించింది. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆఫ్ స్టంప్ ఆవల పడ్డ బంతులపై ప్రాక్టీస్ చేశాడు.

నాణ్యత లేకుండా 'గాజులదిన్నె' పనులు

- కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని గాజులదిన్నె ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంపు పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయని కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం ప్రాజెక్టు ఆనకట్ట పనులను టిడిపి నాయకులు, మాజీ ఎంపిపి సభ్యులు కృష్ణారెడ్డి, సింగిరెడ్డిపల్లె మాజీ ప్రెసిడెంట్ పరమేశ్వర రెడ్డి, రంగన్ బాషతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గాజులదిన్నె ప్రాజెక్టు ఈ ప్రాంతంలో తాగు, సాగునీటికి చాలా ముఖ్యమైన పెద్ద ప్రాజెక్టు అని తెలిపారు. ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పనులు సరైన పర్యవేక్షణ, నాణ్యత లేకుండా నాసిరకంగా జరుగుతున్నాయని చెప్పారు. కట్ట బలోపేతం కోసం రాతి కటకం కూడా సరిగా లేదని విమర్శించారు.

43.5 కేజీల గంజాయి పట్టివేత

- గంజాయి, మట్కా పై స్పెషల్ డ్రైవ్
- 36మంది అరెస్ట్, 33 మట్కా కేసులలో 76మంది అదుపులోకి
- పరారీలో ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తూర్పు ఏజెన్సీ ప్రాంతం, వివిధ మార్గాల ద్వారా గంజాయిని నంద్యాల జిల్లాకు తరలిస్తూ పలువురు వ్యక్తులకు చేరవేస్తున్న ముఠాతో పాటు గంజాయి సేవిస్తున్న పలువురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఎస్‌పి జి. వెంకట రాముడు, నంద్యాల టౌన్ డిఎస్‌పి సి. మహేశ్వర్ రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరెస్టు చేసిన ముఠాను హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయిపైన జిల్లాలో గత వారం రోజుల నుండి ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని అందులో నంద్యాల సబ్ డివిజన్‌లో 2, నంద్యాల-3 టౌన్‌లో ఒకటి, నంద్యాల తాలూకా పిఎస్‌లో ఒక కేసు నమోదు కాగా 15 మంది ముద్దాయిలను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుండి 11.45 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆత్మకూర్ సబ్ డివిజన్‌లో మూడు కేసులు అందులో శ్రీశైలం పిఎస్‌లో ఒకటి, ఆత్మకూరు టౌన్ పీఎస్‌లో రెండు కేసులు నమోదు చేసి 22 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుండి 28.400 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో చాగలమర్రిలో ఇద్దరు ముద్దాయిల వద్ద నుండి 1.200 కేజీలు, డోన్ సబ్‌డివిజన్‌లో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం 43 మంది ముద్దాయిలను గుర్తించగా అందులో 15 మంది గంజాయి వ్యాపారులు, గంజాయి ఇక్కడికి రావడానికి కారణమైన ముగ్గురు ఇక్కడ గంజాయి కొని తాగే వారు 18 మంది ముద్దాయిలుగా గుర్తించినట్లు తెలిపారు. వారిలో 36 మందిని పట్టుకొని అరెస్ట్ చేయగా, మిగిలిన వారు పరారీలో ఉన్నారని వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జిల్లాలో కేసులలో 43.05 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్‌పి వెల్లడించారు.

మార్ష్ సెంచరీ

ఆస్ట్రేలియా 263ఆలౌట్, వుడ్‌కు ఐదు వికెట్లు

యాషెస్ సిరీస్ మూడోటెస్ట్


మిఛెల్ మార్ష్ (118)

లీడ్స్: యాషెస్ సిరీస్ మూడో టెస్ట్‌లోనూ ఇంగ్లండ్ జట్టు రాణించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో 263పరుగులకే ఆలౌట్ చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ మిఛెల్ మార్ష్(118) సెంచరీకి తోడు హెడ్(39) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఓపెనర్లు డేవిడ్ వార్నర్(4), ఉస్మాన్ ఖవాజా(13) ఘోరంగా నిరాశపరిచారు. ఆదుకుంటాడనుకున్న లబూషేన్(21), 100వ టెస్ట్ ఆడుతున్న స్టీవ్ స్మిత్(22) కూడా త్వరగా పెవీలియన్‌కు చేరారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు 85పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో మిఛెల్ మార్ష్ సెంచరీతో కదం తొక్కాడు. మార్ష్-హెడ్ కలిసి 5వ వికెట్‌కు 160పరుగులు జతచేశారు. 240పరుగులకు మార్ష్ వికెట్ కోల్పోయిన తర్వాత ఆస్ట్రేలియా మరో 23పరుగులు జతచేసిన అనంతరం చివరి ఐదు వికెట్లను చేజార్చుకుంది. మార్క్ వుడ్‌కు ఐదు, వోక్స్‌కు మూడు, బ్రాడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 69పరుగులు చేసింది.కమ్మిన్స్‌కు రెండు వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వార్నర్ (సి)క్రాలే (బి)బ్రాడ్ 4, ఖవాజా (బి)వుడ్ 13, లబూషేన్ (సి)రూట్ (బి)వోక్స్ 21, స్మిత్ (సి)బెయిర్‌స్టో (బి)బ్రాడ్ 22, హెడ్ (సి)రూట్ (బి)వోక్స్ 39, మిఛెల్ మార్ష్ (సి)క్రాలే (బి)వోక్స్ 118, క్యారీ (సి)వోక్స్ (బి)వుడ్ 8, స్టార్క్ (బి)వుడ్ 2, కమిన్స్ (ఎల్‌బి)వుడ్ 0, మర్ఫీ (బి)వుడ్ 13, బోలండ్ (నాటౌట్) 0, అదనం 23. (60.4 ఓవర్లలో ఆలౌట్) 263పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/42, 3/61, 4/85, 5/240, 6/245, 7/249, 8/249, 9/254, 10/263 **బౌలింగ్:** బోలండ్ 11.4-0-58-2, రాబిన్సన్ 11.2-2-38-0, మార్క్ వుడ్ 11.4-4-34-5, వోక్స్ 17-1-73-3, మొయిన్ 9-1-40-0

సౌత్ జోన్ 195ఆలౌట్

నార్త్‌జోన్‌తో దులీప్ ట్రోఫీ


మయాంక్ (76 పరుగులు)

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 195పరుగులకు ఆలౌటైంది. ఓవర్ నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 63పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్ జట్టును తిలక్ వర్మ(46) ఆదుకున్నాడు. మయాంక్ అగర్వాల్(76) కూడా అర్ధసెంచరీతో మెరిసాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ నిరాశపరచడంతో సౌత్ జట్టు ఇన్నింగ్స్ 54.4 ఓవర్లలో 195పరుగులకే పరిమితమైంది. జయంత్ యాదవ్, వైభవ్ అరోరాకు మూడేసి, బల్జీత్ సింగ్, హర్షిత్ రాణాకు చెండేసి వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ జట్టు 198పరుగులకే చేయడంతో ఆ జట్టుకు 3పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ జోన్ జట్టు వర్షం కారణంగా రెండోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 34పరుగులు చేసింది. ప్రశాంత్ చోప్రా(14), అంకిత్ కల్సి(15) క్రీజ్‌లో ఉన్నారు. ఆలూరు కస్కా క్రికెట్ మైదానంలో జరుగుతున్న మరో సెమీస్‌లో వెస్ట్‌జోన్ జట్టు సెంట్రల్ జోన్‌పై పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 220పరుగులు చేసిన వెస్ట్‌జోన్ జట్టు సెంట్రల్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 128పరుగులకే పరిమితం చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్ట్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 115పరుగులు చేసింది. దీంతో వెస్ట్‌జోన్ జట్టుకు ఇప్పటికే 207పరుగుల ఆధిక్యత లభించింది. సెంట్రల్ జోన్ ఆటగాడు ఆవేశ్ ఖాన్ భుజం నొప్పి కారణంగా బౌలింగ్ చేసేందుకు ఇబ్బంది పడ్డాడు.

దేశం వెలుపల తొలిసారిగా టాంజానియాలో ఐఐటి కేంపస్

న్యూఢిల్లీ : భారతకు వెలుపలగా మొట్టమొదటి ఐఐటి కేంపస్‌ను టాంజానియాలోని జంజిబార్‌లో ఏర్పాటు చేయనున్నారు. అక్టోబరులో ఇక్కడ విద్యా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని భావిస్తున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఇదొక చారిత్రక చర్యగా ప్రస్తుతం టాంజానియాలో పర్యటిస్తున్న విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. 'పేద దేశాల పట్ల భారతకు గల నిబద్ధత ఇందులో ప్రతిఫలిస్తోందని అన్నారు. జంజిబార్‌లో ఐఐటి-మద్రాసు కేంపస్‌ను ఏర్పాటు చేయడానికి అవగాహనా ఒప్పందం(ఎంఒయు)పై సంతకాలు జరిగాయి. అంతర్జాతీయంగా ఆవిర్భవిస్తున్న అవసరాలకు తగినట్లుగా పోటీతత్వాన్ని పెంపొందించేందుకు విస్తృత ఉద్దేశ్యంతో తొలిసారిగా చర్చ ఇదని విదేశాంగ శాఖ పేర్కొంది. భారతీయ ఉన్నత విద్య ఆకాంక్షలు, ఆవిష్కరణలకు సంబంధించి ప్రపంచానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. జంజిబార్ అధ్యక్షుడు హుస్సేన్ అలీ, జై శంకర్‌లు బుధవారం ఈ ఎంఒయుపై సంతకాలు చేశారు. దీనితో భారతదేశ పేరు ప్రతిష్టలు అంతర్జాతీయంగా పెరుగుతాయని ఆ ప్రకటన పేర్కొంది. ఇరు దేశాల మధ్య గల సుదీర్ఘ స్నేహ సంబంధాలకు ఈ కేంపస్ ఒక ఉదాహరణగా నిలుస్తుందని వ్యాఖ్యానించింది.

చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే ఉపసంహరించుకోవాల్సిందే: బాంబే హైకోర్టు



ముంబయి: చట్ట సభలు రూపొందించిన చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా వుంటే వాటిని ఉపసంహరించుకోవాల్సిందేనని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. నకిలీ, తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఐటీ నిబంధనలపై విచారణలో బాంబే హైకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టంలోని నిబంధనలు రూపొందించేప్పుడు మన ఉద్దేశాలు ఎంత ఉన్నతంగా ఉన్నా సరే.. వాటి ప్రభావం రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే వాటిని మానుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఐటీ నిబంధనలకు వ్యతిరేకంగా దాఖలపై పిటిషన్లను హైకోర్టు గురువారం విచారించింది. ఆన్‌లైన్ కంటెంట్‌లో నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకుగాను ఫ్యాక్ట్‌చెక్ యూనిట్‌ను తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో పేర్కొంది. ఇందుకోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021కు సవరణలు చేసింది. అయితే, ఈ కొత్త నిబంధనలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఐటీ నిబంధనల చెల్లుబాటను సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ క్రమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మ్యాగజైన్స్ బాంబే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

వర్శిటీల్లో కుల వివక్షపై ఏం చర్యలు తీసుకున్నారు?

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకుండా, పిటిషన్‌లో లేవనెత్తిన ఆందోళనలను యుజిసి ఎలా పరిష్కరిస్తోందో, సరిదిద్దుతుందో తెలపాలని జస్టిస్ బోపన్న కోరారు. ఈ ఏడాదిలో ఇప్పటికే ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరమని, వారిలో ఒకరు నేషనల్ లా స్కూల్‌లో, ఒకరు మెడికల్ కాలేజీలో, ఒకరు ఐఐటిలో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అందువల్ల ఈ పిటిషన్ చాలా ముఖ్యమైనదని, అన్ని ఉన్నత విద్యా సంస్థలకు మార్గదర్శకాలను రూపొందించాలని పిటీషనర్ల తరుపు న్యాయ వాదులు కోరారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పిహెచ్‌డి స్కాలర్ రోహిత్ వేముల 2016 జనవరి 17న ఆత్మహత్య చేసుకోగా, ముంబాయిలోని టిఎన్ టోపివాలా నేషనల్ మెడికల్ కాజేలీలో ఆదివాసీ విద్యార్థిని, అబేదా తాడ్వీ కుమార్తె పాయల్ తాడ్వీ 2019 మే 22న బలవన్మరణం పాలయ్యారు. ఈ ఆత్మహత్యలకు విద్యా సంస్థల్లో కుల వివక్షే ప్రధాన కారణమని తేలింది.

బిజెపిని గద్దె దించాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో వ్యవసాయాన్ని, రైతాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా రైతాంగం 500 రోజులు ఉద్యమించి 750 మంది రైతులు తమ ప్రాణాలను అర్పించి, ప్రపంచంలో ఇప్పటి వరకు జరగని రీతిలో ఐక్యంగా పోరాడి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి ఈ చట్టాలను వెనక్కి తీసుకొనేలా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్టు మీటర్లు బిగించి రైతుల మెడకు ఉరితాడు బిగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. 1991లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన సరళీకరణ విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందని, కార్పొరేట్లకు మేలు చేకూర్చే చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు ప్రసంగించారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కె.అజయ్‌కుమార్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజికీ కష్టమే..



- పెరుగుతున్న బియ్యం ధరలు
- ధరల సూచికలో 11 ఏళ్ల గరిష్ట స్థాయికి..
- దిగుబడులపై ఎల్‌నినో ప్రభావం

ముంబయి : గడచిన 11 సంవత్సరాలతో పోలిస్తే అంతర్జాతీయంగా బియ్యం ధరలు ఈ ఏడాది బాగా పెరిగాయి. ఎల్‌నినో ప్రభావంతో కొన్ని దేశాలలో ధాన్యం దిగుబడి తగ్గడంతో ధరలపై ప్రభావం పడుతోంది. బియ్యం ఎగుమతులు మన దేశం నుండే 40% వరకూ జరుగుతున్నాయి. గత సంవత్సరం మన దేశం నుంచి 56 మిలియన్ టన్నుల బియ్యం ఎగుమతి అయింది. భారతదేశం బియ్యాన్ని అతి తక్కువ ధరకు సరఫరా చేస్తోందని బియ్యం ఎగుమతిదారుల సంఘం (ఆర్‌ఇఎ) అధ్యక్షుడు బీవీ కృష్ణారావు తెలిపారు.

ఆసియాలో 300 కోట్ల మంది ప్రజలు వరి అన్నమే తింటారు. సుమారు 90% పంటను నీటి పారుదల సౌకర్యం పైనే ఆధారపడి వేస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావంతో ఆసియాలో వర్షపాతం తగ్గింది. అననుకూల వాతావరణం కారణంగా ఉత్పత్తి తగ్గడానికి ముందే అంతర్జాతీయ బియ్యం ధరల సూచిక 11 సంవత్సరాల గరిష్ట స్థాయిని చేరింది. థాయిలాండ్, వియత్నాంలలో మాత్రం ప్రభుత్వాలు రైతులకు ప్రోత్సాహకాలు అందించడంతో ఉత్పత్తి కొంత పెరిగింది. పరిమిత సరఫరా కారణంగా బియ్యం ధరలు ఇప్పటికే పెరిగాయని, ఉత్పత్తి తగ్గితే అవి మరింత పెరుగుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

దాదాపు అన్ని ఆసియా దేశాలలో ఎల్‌నినో ప్రభావం రెండో పంటపై పడుతుందని, దీంతో సాధారణ స్థాయి కంటే తక్కువగానే పంట దిగుబడి వస్తుందని, ఆ పరిస్థితుల్లో ధరలు మరింత పెరుగుతాయని ఢిల్లీకి చెందిన ఒక వ్యాపారి తెలిపారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున ఒకే పంట వేయాల్సిందిగా థాయిలాండ్ ప్రభుత్వం రైతులను కోరింది. మన దేశంలో కూడా వేసవి పంట విస్తీర్ణం తగ్గింది. సాధారణం కంటే వర్షపాతం 8% తగ్గడమే దీనికి కారణం. మన దేశంలో పాలక పక్షానికి ఆహార ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తోంది. ధరలను అదుపులో ఉంచేందుకు గత సంవత్సరం గోధుమల ఎగుమతులపై నిషేధం విధించింది. బియ్యం, చక్కెర ఎగుమతులపై కూడా ఆంక్షలు పెట్టింది. ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే సంవత్సరం ప్రారంభంలో లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి ఉంది. పర్యావరణ పరిస్థితుల కారణంగా విత్తనాలు వేసుకోవడం ఆలస్యం కావడం, మరోవైపు దేశంలో ధరలు పెరగడం ప్రధాని నరేంద్ర మోడీని, బిజెపిని కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఎగుమతులపై మరిన్ని ఆంక్షలు విధించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మన దేశం ఆంక్షలు విధిస్తే ఇతర దేశాల సరఫరాలపై ప్రభావం పడుతుంది. సరఫరాలు సరిగా లేకపోవడం, భారత్ నుండి ఎగుమతులు తగ్గడం వల్ల అంతర్జాతీయంగా ధరలు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ధాన్యాన్ని కొని నిల్వ చేయడం కష్టమవుతుంది.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మణిపూర్‌పై చర్చకు నిరాకరణ

- ప్రతిపక్ష ఎంపిలు వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ పరిస్థితిపై చర్చించాలన్న తమ డిమాండ్ నిరాకరించడంతో ముగ్గురు ప్రతిపక్ష పార్టీల ఎంపిలు హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. గురువారం స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ బ్రిజ్‌లాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలు దిగ్విజయ సింగ్, ప్రదీప్ భట్టాచార్య, టిఎంసి ఎంపి డెరెక్ ఓబ్రెయిన్ ముగ్గురూ సమావేశం ప్రారంభమైన పది నిమిషాలకే నిష్క్రమించారు. జైళ్ల స్థితిగతులపై చర్చ చేపట్టేలోపు మణిపూర్ పరిస్థితిపై కమిటీ అత్యవసరంగా చర్చించాలని ఈ ముగ్గురు ఎంపిలు డిమాండ్ చేశారు. జైలు పరిస్థితులపై చర్చ తరువాత జరగవచ్చని, మణిపూర్ గురించి త్వరగా చర్చించాలని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ కోరారు. మణిపూర్‌లో "తీవ్రమైన సంక్షోభం"లో ఉన్న పరిస్థితిని చర్చించాల్సిన అవసరాన్ని బ్రిజ్ లాల్‌కు రాసిన లేఖలో ఓబ్రెయిన్ నొక్కి చెప్పారు. మణిపూర్‌లో హింసకు ముగింపు అవసరం అని అన్నారు. మణిపూర్‌పై చర్చించేందుకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెలలో కొందరు ఎంపిలు ఛైర్మన్‌కు లేఖలు కూడా రాశారని, సమావేశ ఎజెండాను నిర్ణయించడం ఛైర్మన్‌కు ఉన్న అధికారమని నొక్కిచెప్పినట్లు లేఖలో గుర్తు చేశారు. సరిహద్దు రాష్ట్రంలో 100 మందికి పైగా మరణించిన మరియు 50,000 మందికి పైగా ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాల్సిన పరిస్థితి గురించి దిగ్విజయ సింగ్ గత నెలలో బ్రిజ్ లాల్‌కు లేఖ రాశారు. మతపరమైన మలుపు తీసుకున్న ఈ హింసలో 250కి పైగా చర్చిలు, 100 దేవాలయాలు ధ్వంసమయ్యాయని, 2,000 ఇళ్లు తగలబడిపోయాయని సింగ్ లేఖలో పేర్కొన్నారు.

18న ఎన్‌డిఎ భేటీ

- టిడిపి ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లోని పాట్నాలో ప్రతిపక్షాల సమావేశం విజయవంతం కావడంతో బిజెపిలో గుబులు పట్టుకుంది. అందుకనే బిజెపి భాగస్వామ్య పక్షాల సమావేశానికి పిలుపు ఇచ్చింది. ఇన్ని రోజులు పట్టించికోని బిజెపి, ఒక్కసారిగా మిత్రపక్షాల జపం చేస్తుంది. అపాయింట్ మెంట్ కూడా ఇవ్వని నేతలను సమావేశానికి ఆహ్వానిస్తుంది. జులై 18న ఎన్‌డిఎ పక్షాల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి పాత మిత్రపక్షాలు టిడిపి, శిరోమణి అకాలీ దళ్, ఎల్‌జెపి (చిరాగ్ పాశ్వాన్) పార్టీలకు కూడా ఆహ్వానాలు అందినట్లు సమాచారం. మరోవైపు.. ఇప్పటికే ఎన్డీఏ ఉన్న భాగస్వామ్యపక్షాలతో పాటు కొత్తగా కూటమిలోకి తీసుకునే వారికి కూడా సమావేశానికి హాజరుకావాలని బిజెపి నుంచి ఆహ్వానాలు వెళ్లాయి. టిడిపి, శిరోమణి అకాలీదళ్, లోక్ జనశక్తి (పాశ్వాన్) పార్టీలు సహా మరికొన్ని పార్టీలకు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. 18న ఢిల్లీలోని అశోకా హెూటల్‌లో ఈ సమావేశం జరగబోతోంది. లోక్‌సభ ఎన్నికలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిజెపి నాయకులు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. అందుకే.. కేంద్ర, రాష్ట్రాల పార్టీలో మార్పులు, చేర్పులు చేశాక ఎన్డీఏ విస్తరణకు కసరత్తు పూర్తి చేసిన తర్వాతే ఇలా సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం, బిజెపి ముఖ్యులు కార్యాచరణకు పూనుకున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల పార్టీల అధ్యక్షులను మార్చిన బిజెపి, రెండు మూడ్రోజుల్లో కేంద్ర కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ చేయబోతోంది. ఈ కీలక సమావేశానికి లోపే మార్పులు, చేర్పులు జరగాలని, వీలైతే కొత్తగా ఎన్డీఏలో చేరే ఒకట్రెండు పార్టీలకు కూడా కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, ఈ సమావేశం తరువాత ఎన్‌డిఎ చేరికపై టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. నిన్న, మొన్నటి వరకూ బిజెపితో వైసిపి అంటకాగుతోందని ఆరోపించిన తెలుగు దేశం, ఇప్పుడు సడన్‌గా ఎన్డీఏ సమావేశానికి వెళ్తుండటంతో ఇప్పుడిదే హాట్ టాపిక్ అయ్యింది.

నడ్డాతో పురందేశ్వరి భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాను ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షులు పురందేశ్వరి కలిశారు. అధ్యక్షురాలిగా నియమించడంపై నడ్డాకు పురందేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి నడ్డాకు కతజ్ఞతలు తెలిపినట్లు పురందేశ్వరి వెల్లడించారు. నిబద్ధతతో పని చేస్తానని జెపి నడ్డాకు తెలిపినట్లు చెప్పారు. ఏపిలో బిజెపిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆంధ్రుల ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తానని పురందేశ్వరి తెలిపారు.

నేషనల్ హెల్త్ సర్వీస్ పరిరక్షణకు పోరు

బ్రిటన్ ప్రజల మనోగతం



లండన్ : బ్రిటన్‌లో నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) ప్రారంభించి బుధవారానికి 75ఏళ్ళు అవుతోంది. ఈ నేపథ్యంలో దీని మనుగడపై అనేక సందేహాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎస్ వ్యవస్థాపకుడు నయే బెవన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. "ప్రజలకు దీనిపై విశ్వాసం వున్నంత కాలమూ ఇది మనుగడలో వుంటుంది. దాని కోసం పోరాటం చేయాల్సిన అవసరమూ వుంటుంది." అన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. ఈనాడు ఎన్‌హెచ్‌ఎస్ తీవ్ర సంక్షోభంలో వుంది. వైద్యం నిరీక్షిస్తున్న రోగుల జాబితా లక్షల సంఖ్యలో వుంది. వారికి చికిత్సల్లో జరుగుతున్న జాప్యానికి సర్వత్రా ఖండనలు ఎదురవతున్నాయి. ఇలా చికిత్సల్లో జాప్యం జరగడం అన్నిసార్లు బాధాకరంగా వుంటుంది. మరికొన్నిసార్లు ప్రమాదకరంగా మారుతోంది. ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. బయట అంబులెన్సులు క్యూ కడుతున్నాయి. రోగులను డిశ్చార్జ్ చేయడానికి కూడా గంటలు వేచి వుండాల్సి వస్తోంది. వైద్యానికయ్యే వ్యయాన్ని భరించేవారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళతారు. లేనివారు ఇలా వైద్యం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో 2019 నుండి ఇలా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సల కోసం వెళుతున్న వారి సంఖ్య దాదాపు మూడో వంతు పెరిగింది. దీంతో ప్రైవేటు రంగంలో శిక్షణ పొందిన మెడికల్ వర్కర్లకు డిమాండ్ పెరిగింది. మరోవైపు ఎన్‌హెచ్‌ఎస్‌లో ఇప్పటికే లక్షకు పైగా ఖాళీలు వున్నాయి. ఎవరు డబ్బు చెల్లించగలరో వారికే త్వరగా చికిత్స అందుతోంది. మరోవైపు పేదలకు చికిత్సనందించడం కోసం పనిచేయాల్సిన సార్వజనీన ఆరోగ్య సర్వీసు సేవలు కుదించుకుపోతున్నాయి. వీటికి సమగ్రంగా నిధులు అందడం లేదు. అవసరమైనంతగా పెట్టుబడులు పెట్టకపోవడం, ప్రైవేటీకరణ అనేవి ఎన్‌హెచ్‌ఎస్ క్షీణించడానికి ప్రధానమైన రెండు కారణాలుగా వున్నాయి. ఎన్‌హెచ్‌ఎస్ అనేది వ్యయభరితమైన, కాలదోషం పట్టిన అంశంగా టోరీ, లేబర్ పార్టీల నాయకులు భావిస్తున్నారు. సాధారణంగా ఎన్‌హెచ్‌ఎస్‌ను దాని సాంప్రదాయ రూపంలో అమలు చేయడం భరించలేనిదిగా మారిందన్న ఆలోచన నేతల్లో నెలకొంది. దీనికి ప్రధాన కారణం సమాజంలో పెరుగుతున్న వృద్ధులు. వీరికయ్యే వ్యయం అధికంగా, సుదీర్ఘకాలం కొనసాగడమే. ఇటువంటి పరిస్థితుల్లో, తాజాగా బ్రిటన్ వైద్య వ్యవస్థలో కనివినీ ఎరుగని రీతిలో సమ్మెలు, ఆందోళనలు, నిరసనలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత ఏకైక ఆశాకిరణం ప్రజలకు ఈ వ్యవస్థపై నమ్మకం వున్నంత కాలమూ దీనికోసం పోరాటం జరపడమేనని.

బలవంతపు సివిల్ కోడ్‌కు వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఒక మత ఆచారాలను అన్ని రకాల మతాలపై రుద్దాలని చూడటం సరికాదని పేర్కొన్నారు. దేశంలో గిరిజనులు, క్రిస్టియన్లు, ముస్లిములు, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో ఆదివాసీ ప్రజలకు వేర్వేరు సంప్రదాయాలు ఉంటాయని, యుసిసి వల్ల వారికి తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్రం చెబుతున్న యుసిసి వల్ల అందరికీ ఉద్యోగం, విద్య, గౌరవంగా జీవించే హక్కులు రాకపోగా దాడులు పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. ప్రస్తుతం దేశంలో మహిళలకు అన్యాయం జరుగుతోందని, అన్ని రంగాల్లోనూ వారిని పక్కన పెడుతున్నారని, ముందు వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. యుసిసిని ముందుకు తీసుకొస్తున్న బిజెపి పాలిత రాష్ట్రాల్లో చిన్న పిల్లలకు వివాహాలు చేస్తున్నారని, వారిపై తీవ్ర ఆంక్షలు ఉంటున్నాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఒక మతం ఓట్లను రాబట్టుకోవాలనే కుట్రతోనే బిజెపి అవసరం లేని ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసేందుకు ముందుకు తీసుకొస్తోందని విమర్శించారు. మోడీ అనుసరిస్తున్న విధానాలు వేర్వేరు మతాలతోపాటు మహిళలపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. భారత్‌ను ఫాసిస్టు, మతతత్వ దేశంగా మార్చేందుకు బిజెపి నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళలో మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తున్నారని, కుడుంబశ్రీ పథకం ప్రవేశ పెట్టి ఒంటరి, అవివాహిత మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారని, ఇళ్లను నిర్మించి ఇస్తున్నారని తెలిపారు.

రెచ్చగొడుతున్న ప్రధాని

మణిపూర్‌లో హింసకు ఇప్పటి వరకు 130 మంది చనిపోయారని, అయినా ప్రధాని దాని గురించి మాట్లాడటం లేదని పేర్కొన్నారు. అమెరికా నుండి తిరిగి వచ్చిన ప్రధాని ఉమ్మడి పౌర స్మృతి గురించి మాట్లాడా రని, మణిపూర్‌లో హింసను నివారించేందుకు ఒక్క ప్రకటన కూడా చేయలేదని అన్నారు. యుసిసి పేరుతో దేశ ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. మోడీ విధానాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాల న్నారు. రాష్ట్రంలోనూ మహిళలపై పెద్దఎత్తున హింస జరుగు తోందని అన్నారు. ఇప్పటికీ మహిళలపై దాడులకు సంబంధించి రాష్ట్రంలో 14 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బాలికలపై అత్యాచారాలకు అంతే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా ఆగస్టు 8న విజయవాడలో సభ నిర్వహిస్తామని, అంతకుముందే హిందూపూర్, విశాఖ నుండి యాత్రలు చేపడతామని తెలిపారు. అంతకుముందు మహిళా ఉద్యమ నాయకులు మానికొండ సూర్యావతి, సంపర తులశమ్మ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.



ద్వైపాక్షిక, రక్షణ సహకారంపై చర్చ

- ఐఎన్‌ఎస్ త్రిశూల్‌లో జాంజిబార్ అధ్యక్షుడితో జై శంకర్

జాంజిబార్ సిటీ : ప్రస్తుతం టాంజానియాలో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఐఎన్‌ఎస్ త్రిశూల్‌లో జాంజిబార్ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అలీ మివిన్యితో కలిసి విందులో పాల్గొన్నారు. తూర్పు ఆఫ్రికా తీరంలో టాంజానియా ద్వీప సమూహమే జాంజిబార్, ఈ ప్రాంతంలో శాంతి, సంపదలు విలసిల్లేలా చూడాలన్న భారత్ నిబద్ధతకు ఈనాడు ఈ నౌక ఇక్కడుండడం ఒక తార్కాణమని ఆయన వ్యాఖ్యానించారు. భారత నావికాదళానికి చెందిన త్రిశూల్ నౌక టాంజానియాలో పర్యటిస్తోంది. జాంజిబార్‌లో రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం బుధవారం జై శంకర్ ఇక్కడకు వచ్చారు. అధ్యక్షుడు మివిన్యితో ఆయన ద్వైపాక్షిక సంబంధాలపై, రక్షణ సహకారంపై చర్చలు జరిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి సుస్థిరతలు, సంపద, సంక్షేమాలకు హామీ కల్పించే సముద్ర జలాల చొరవే సాగర్ (ఈ ప్రాంతంలో అందరికీ భద్రత, అభివృద్ధి). సాగర్ పట్ల నిబద్ధత ఈనాటి తమ పర్యటన, విందు సమావేశంలో ప్రతిఫలిస్తున్నాయని జై శంకర్ ట్వీట్ చేశారు. ఈ రిసెప్షన్‌లో జై శంకర్ మాట్లాడుతూ, భారత పశ్చిమ తీరం, ఆఫ్రికా తూర్పు తీరం మధ్య గల సంబంధాలు చాలా చారిత్రకమైనవని భావిస్తున్నట్లు చెప్పారు. మన అభివృద్ధి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే సమయం కూడా ఇదేనని ఆయన వ్యాఖ్యానించారు. జలవనరుల అభివృద్ధి రంగంలో భారత్‌కు గల అవకాశాలను జాంజిబార్‌తో పంచుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. జి 20లో ఆఫ్రికన్ యూనియన్ శాశ్వత సభ్యత్వం గురించి ప్రతిపాదించబడిందని, దీన్ని సభ్య దేశాలు పరిశీలించాలన్నారు.

ఢిల్లీ ఆర్డినెన్స్‌పై 10న విచారణ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు ఆంగీకరించింది. ఈ నెల 10న పిటీషన్‌ను విచారించనుంది. ఢిల్లీలో గ్రూప్-ఎ అధికారుల బదిలీలు, నియామకాలు, క్రమశిక్షణ వంటివన్నీ తన పరిధిలోకి తెచ్చుకుంటూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదిలీలపై నియంత్రణాధికారం స్థానిక ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కొద్ది రోజుల్లో కేంద్రం ఈ ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీనిని ఆప్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఇప్పుడు దీనిపై జులై 10న విచారణ జరిపేందుకు కోర్టు అంగీకరించింది. కాగా, మరోవైపు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ప్రభుత్వం మధ్య మరో వివాదం ప్రారంభమయింది. తాజాగా వీకే సక్సేనా ఇచ్చిన ఉత్తర్వులను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. ఉత్తర్వులతో ఢిల్లీ ప్రభుత్వం గొంతును నులిమేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రభుత్వంలోని నిపుణులు, సలహాదారులు తన అనుమతి లేకుండా కార్యకలాపాలు నిర్వహించకూదని ఎల్‌జి కొత్తగా ఇచ్చిన ఉత్తర్వుల సారాంశం. దీనిపై కేజ్రీవాల్ ట్విటర్ వేదికగా స్పందించారు. 'ఈ ఉత్తర్వులు ఢిల్లీ ప్రభుత్వం గొంతును పూర్తిగా నులిమేస్తాయి. ఇది ప్రభుత్వ పనితీరును పూర్తిగా అణచివేస్తుంది. ఈ నిర్ణయాలతో గౌరవనీయ ఎల్‌జీ ఏం సాధించాలనుకుంటున్నారు. సుప్రీం కోర్టు ఈ ఉత్తర్వులను కొట్టివేస్తుందని ఆశిస్తున్నాను' అని ట్వీట్ చేశారు. గతంలో కూడా ఎల్‌జీ ఈ తరహా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ప్రభుత్వం వివిధ విభాగాల్లో నియమించిన 400 మంది సలహాదారులు/నిపుణులను ఎల్‌జీ ఏకపక్షంగా తొలగించారు.

జి 20 సదస్సుకు పుతిన్?

- రష్యా రాయబారి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : భారత్‌లో జి 20 సదస్సు నిర్వహణ, రష్యాకి సంబంధించినంతవరకు అతి ముఖ్యమైన కార్యక్రమాల్లో ఒకటని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ సమావేశానికి హాజరయ్యే అవకాశాలు వున్నాయని సీనియర్ రష్యన్ దౌత్యవేత్త ఒకరు సూచనప్రాయంగా తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత పశ్చిమ దేశాల నాయకులను పుతిన్ మొదటిసారిగా ముఖాముఖి కలుసుకునే అవకాశం దీంతో ఏర్పడనుంది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతి వారం నిర్వహించే పత్రికా సమావేశంలో అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ ప్రతినిధి సమాధానమిస్తూ, సెప్టెంబరు 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జి 20సదస్సుకు పుతిన్‌ను స్వాగతించేందుకు మోడీ ప్రభుత్వం ఎదురుచూస్తోందని చెప్పారు. ఈ ఏడాది కీలక కార్యక్రమాల్లో ఈ సదస్సు ఒకటిగా భారత్ భావిస్తోందన్నారు. సదస్సు నిర్వహణకు అన్ని సన్నాహక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

త్వరలోనే పుతిన్ పర్యటనా వివరాలు తెలుస్తాయని రష్యన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ రోమన్ బాబుషికిన్ హిందూకు ఇచ్చిన రాతపూర్వక ఇంటర్వ్యూలో తెలిపారు. జి20 సదస్సు విజయవంతం కావడానికి భారత్ అధ్యక్ష వర్గానికి మద్దతిచ్చేందుకు రష్యా కృత నిశ్చయంతో వుందని చెప్పారు. గతేడాది బాలిలో జరిగిన జి20 సదస్సులో ఉక్రెయిన్ గురించి వున్న పేరాగ్రాఫ్‌లపై సంతకం చేసిన విషయాన్ని గమనంలోకి తీసుకుంటే ఢిల్లీ ప్రకటనపై రష్యా, చైనాలు ఎందుకు ఏకాభిప్రాయాన్ని కలిగివున్నాయని ప్రశ్నించగా, ఆర్థికాంశాలను చర్చించేందుకు ఉద్దేశించిన జి20 సదస్సును రాజకీయం చేయడం ద్వారా భారత్ అధ్యక్షవర్గ బాధ్యతలను పశ్చిమ దేశాలు దెబ్బతీస్తున్నాయని రష్యా రాయబారి వ్యాఖ్యానించారు. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలను పెంచాలన్న పశ్చిమ దేశాల ఆలోచన, బాలి ఏకాభిప్రాయాన్ని మరింత అసంబద్ధం చేసిందని బాబుషికిన్ పేర్కొన్నారు. జి20 ఎజెండాలో ఉక్రెయిన్‌ను భాగం చేయాలని పశ్చిమ దేశాలు భావించినపుడు జి7 యేతర దేశాలన్నీ బహిరంగంగానే మౌనం పాటించాయని ఆయన విమర్శించారు. యుగోస్లోవియా, ఇరాక్,లిబియా, సిరియా, ఇతర చోట్ల ప్రచారాల గురించి వారు ఎందుకు ప్రస్తావించలేదని ఆయన ప్రశ్నించారు.

ఉపాధి దుర్వినియోగంపై సాంకేతిక నిఘా!

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో పురోగతిని పరిశీలించేందుకు, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కేంద్రం భావిస్తోంది. పనుల అంచనాలు మరింత పారదర్శకంగా ఉండేందుకు, పథకానికి సంబంధించిన ప్రాజెక్టులను మెరుగ్గా పర్యవేక్షించేందుకు టెక్నాలజీని వినియోగిస్తారు. అంచనాలు మరింత కచ్చితత్వంతో ఉండేందుకు, పని పురోగతిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు టెక్నాలజీ సాయం తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. గతంలో అంచనాలను రూపొందించడం, పనుల పురోగతిని పర్యవేక్షించడం వంటి పనుల్ని ఇంజినీర్లు చేసే వారు. అయితే వారు భౌతికంగా వేసే అంచనాలలో కచ్చితత్వం లోపిస్తోంది. ఈ నేపథ్యంలో సాంకేతిక సాయం తీసుకునే దిశగా మంత్రిత్వ శాఖ ఇప్పటికే ప్రైవేటు కంపెనీలను, ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు వంటి సాంకేతిక సంస్థలను పలు దఫాలుగా సంప్రదించింది. అయితే చర్చలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. డ్రోన్లు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, మొబైల్ పరికరాలు వంటి వాటిని ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. పని ప్రదేశంలో 3డీ ల్యాండ్ ప్రొఫైల్‌ను చేపట్టే అంశం కూడా పరిశీలనలో ఉంది.

ఉపాధి పథకంలో కార్మికుల హాజరు నమోదు కోసం ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)ను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. వేతనాలు చెల్లించేందుకు ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఏబీపీఎస్)ను తప్పనిసరి చేశారు. అయితే ఈ రెండు నిర్ణయాలను కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఏబీపీఎస్ అమలును ఆగస్ట్ 31వ తేదీ వరకూ వాయిదా వేశారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఒంటరిగానే ఎదుర్కొంటాం : మంత్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఒంటరిగానే ఎదుర్కొంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం నాడిక్కడ ఏపి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలు ముందు వచ్చినా, వెనుక వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అన్ని ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసి విజయం సాధించామని తెలిపారు. గత ఎన్నికల కంటే ఈ సారి ఎక్కువ సీట్లు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి ఎవరిని అధ్యక్షురాలిగా నియమించుకున్నా తమకు సంబంధం లేదన్నారు. మూడు పార్టీలు కలిసినా, బిఆర్‌ఎస్ కలిసినా తాము ఎన్నికల్లో ఒంటరిగా వెళ్తామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే సిఎం జగన్ ఢిల్లీ పర్యటన అని వెల్లడించారు. గత ప్రభుత్వం రూ.20 వేల కోట్ల అప్పులు చేసిందని, వాటిని పసుపు, కుంకుమకు మళ్లించారని తెలిపారు. ఆ అప్పులన్నీ తాము తీర్చి, శాఖను మళ్లీ గాడిలో పెట్టామన్నారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. ధాన్యం తడిసినా, నూక వస్తున్నా రైతులకు మద్దతు ధర ఇచ్చామన్నారు. కోటి 46 లక్షల మందికి రేషన్ ఇస్తున్నామని చెప్పారు. కేంద్రం కంటే అదనంగా 60 లక్షల కార్డులు ఇచ్చామని, వాటికి కేంద్రం సాయం చేయాలని కోరామన్నారు. నీతి ఆయోగ్ దీనికి అనుకూలంగా సిఫారసు చేసిందని మంత్రి నాగేశ్వరావు పేర్కొన్నారు.

జెనిన్‌లో ఏ ఇల్లు చూసినా విధ్వంసమే !

- మిలటరీ స్థావరాలుగా మారిన ఇళ్ళు
- బీభత్సాన్ని సృష్టించిన ఇజ్రాయిల్ సైనిక బలగాలు

జెరూసలేం : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ పట్టణంలో ఏ ఇల్లు చూసినా వినాశనం, విధ్వంసమే కనిపిస్తోంది. పెద్ద తుపానులు వస్తే ఇల్లు వాకిలీ ఎలా ధ్వంసమవుతాయో ఆ రకమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇళ్ళలోని ఫర్నిచర్ అంతా పగిలిపోయి, విరిగిపోయి, నేల బీటలు వారి, కరెంట్ లైన్లు కట్ అయిపోయి ఎక్కడ చూసినా బీభత్సంగా వుంది. ఇజ్రాయిల్ బలగాలు జెనిన్ నుండి వైదొలగిన తర్వాత అక్కడి పరిస్థితి ఇది. ఏది కూడా ఉపయోగించడానికి వీలుగా లేదు. పెద్ద వినాశనమే చోటు చేసుకుంది అని తమ ఇళ్ళకు తిరిగి వచ్చినవారు వ్యాఖ్యానిస్తున్నారు. ఆదివారం నుండి మూడు రోజుల పాటు సాగిన ఇజ్రాయిల్ ఆర్మీ దాడుల తర్వాత నెమ్మదిగా ఒకరొకరుగా వస్తున్నారు. "ఇంట్లో ప్రతిదీ మరమ్మత్తులు చేయించుకోవాల్సిందే, వీటికి కనీసం నెల రోజులు పట్టేలా వుంది." అని తహనెహ్ (41) వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లోనే అత్యంత దారుణంగా జరిగిన దాడి ఇది. "కేవలం పది నిముషాల్లోగా ఇక్కడ నుండి వెళ్ళిపోవాలి. లేనిపక్షంలో మీ ఇళ్ళపై బాంబు దాడులు చేస్తాం." అని సైనిక బలగాలు మైకుల్లో గట్టిగా కేకలు వేసారని తహనెహ్ గుర్తు చేసుకున్నారు.

జెనిన్ పట్టణంలో అనేక ఇళ్ళు ఇజ్రాయిల్ ఆర్మీ బలగాలకు మిలటరీ స్థావరాలుగా మారాయి. అనేక ఇళ్ళకు బయటి గోడలకు పెద్ద పెద్ద రంధ్రాలు పెట్టి వాటిల్లో నుండి పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఆ ప్రాంతాల్లో నేలపై ఎక్కడ పడితే అక్కడ ఖాళీ తూటాలు పడి వున్నాయి. ఇళ్ళలో వస్తువులను, ఆహార పదార్థాలను చెల్లాచెదురు చేశారు. ఇళ్ళకు వచ్చి చూసుకుంటే కేవలం విధ్వంసం తప్ప మరేమీ కానరావడం లేదని వారు వాపోతున్నారు. 1948లో తమ స్వంత ఇళ్ళ నుండి వెళ్ళగొట్టబడిన దాదాపు 23,600మంది పాలస్తీనియన్లు జెనిన్ పట్టణంలో పునరావాసం ఏర్పాటు చేసుకున్నారు.



చిన్నారి



మీకోసం

తరచూ తుమ్ములు, జలుబు, దురదలు వస్తుంటే ఆహారంలో అల్లం, పసుపు, జీలకర్ర ఎక్కువగా తీసుకోవాలి.

జీవన సౌరభం

ఇతరులకు అర్థమయ్యేటట్లు చెప్పలేకపోవడమంటే ఆ విషయం నీకే సరిగ్గా అర్థం కాలేదన్నమాట.



నమ్మకం

ఓ సాధువు అడవిల్లో ఆశ్రమం నిర్మించుకుని ఉంటున్నాడు. ఆయన వద్దకు గురుకులంలో చదువుకునే నలుగురు విద్యార్థులు వచ్చి 'మునీంద్రా! మేం ఎంత చదివినా విషయం గుర్తుండటంలేదు. గొప్ప చదువు చదవాలనే కోరిక ఉంది. మీ వద్ద అనేక మహిమలు ఉన్నాయని విన్నాం. మా కోరిక తీరుస్తారని మీ వద్దకు వచ్చాము. మా కోరిక తీర్చగలరా?' అని అడిగారు.

సాధువు కొంతసేపు మౌనంగా వుండి, గడ్డాన్ని సవరించుకుని 'అలాగే' అన్నాడు. నలుగురి నుదుటన మంత్రించిన విభూది బొట్టుగా పెట్టి, మూలికలు పొడిని నాలుగు పొట్లాలు కట్టి నలుగురికి ఇచ్చాడు. 'దీన్ని ప్రతి నెల పౌర్ణమి రోజున 'చదువు చాలా సులువు, చదువు చాలా సులువు' అనుకుంటూ పాలలో కలిపి సేవించండి' అని వారిని పంపాడు.

నలుగురు వెళ్ళిపోయారు. ఏడాది గడిచింది. ఆశ్చర్యంగా నలుగురిలోనూ మార్పు వచ్చింది. తమ తమ తరగతిలో చాలా మొద్దులుగా వుండే వీరు తరగతిలో ప్రథములుగా మారారు. ఇదంతా సాధువు ఇచ్చిన మూలికా మహత్యం కారణంగానే కదా? అని ఆయనకు కృతజ్ఞత తెలపటానికి మళ్ళీ సాధు ఆశ్రమానికి వెళ్లారు.


ముని వారిని గుర్తించనే లేదు. వీరే ఆయనకు పరిచయం చేసుకుని మీ మూలికా మహత్యం వల్లనే చదువులో రాణిస్తున్నాం ' అని చెప్పారు.

సాధువు సంతోషించి 'నాయనలరా! నేనిచ్చిన మూలికలో ఏ మహిమా లేదు. నేను ఏ మంత్రం వేయలేదు. నేనిచ్చిన ఆ మూలికల పొడిపై మీకు నమ్మకం కుదిరింది. దాంతో బలంగా మీ మనుసుల్లో నాటుకుని కష్టపడి చదివారు. కృషి చేసారు. మీలో వుండే మీ ఆత్మవిశ్వాసమే మిమ్ముల్ని గెలిపిస్తుంది' అన్నాడు. అది నిజమే అనిపించింది ఆ నలుగురికి. సాధువు వద్ద సెలవు తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు.

- డా.దార్ల బుజ్జిబాబు
92905 04570


బొమ్మ గీయండి!

చిన్నారులూ , ఈ రోజు చిన్న ఎలుకపిల్ల బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెలు ఆధారంగా బొమ్మ గీయండి.



నేను గీసిన బొమ్మ





- అనిక,
5వ తరగతి,
శ్లోక ఇంగ్లీషు మీడియం స్కూలు,
హైదరాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

డయాబెటిస్ పిల్లల కోసం..

తన సోదరుడు డయాబెటిస్‌తో పడుతున్న బాధను చూడలేక దివా ఉత్కర్ష చలించింది. అటువంటి పరిస్థితి ఏ పిల్లవాడికి రాకూడదని పాఠశాల స్థాయి నుంచే అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. వ్యాధిగ్రస్తుల జీవనశైలి మార్పు కోసం నిరంతరం కృషి చేస్తోంది. 'ప్రాజెక్ట్ సూర్య' ద్వారా పదిహేను వేల మంది పిల్లలకు వైద్యసేవలు, మందులు ఉచితంగా అందజేస్తూ అంతర్జాతీయ అవార్డును అందుకుంది.

దేశంలో డయాబెటిస్‌తో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజూకూ పెరిగిపోతుంది. కాని ఇప్పుడు ఇది చిన్న పిల్లల్లోనూ కనిపిస్తోంది. ఈ క్రమంలో బెంగుళూరుకు చెందిన దివా ఉత్కర్ష టైప్ 1 డయాబెటిస్ భారిన పడ్డ పిల్లలకు అండగా నిలిచారు. డయాబెటిస్ వల్ల కలిగే మానసిక కుంగుబాటును దూరం చేస్తున్నారు. కనీసం పద్నాలుగేళ్ళ కూడా నిండని దివా ఉత్కర్ష ఈ బృహత్తర కార్యానికి నాయకత్వం వహిస్తూ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంది. అందుకు తన సోదరుడు సూర్యానే కారణమంటుంది. దివాకు పన్నెండేళ్ల వయస్సులో, తొమ్మిదేళ్ల సూర్యకు టైప్ 1 డయాబెటిస్ ఉందని నిర్ధారణ అయ్యింది. రోజులో రెండు పూటలా ఇన్సులిన్ ఇవ్వాలని వైద్యులు సూచించారు. అది విన్న తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. ఇద్దరూ వైద్యులే. అయినా తన బిడ్డకు డయాబెటిస్ రాకుండా చూసుకోలేకపోయారు. అందుకు వారు కుంగిపోయారు. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులు సూర్యకు సమయానికి ఇన్సులిన్ ఇవ్వడం, వ్యాయామాలు చేయించడం చేస్తున్నారు. అన్ని వనరులు ఉన్నా సూర్య దాన్ని తట్టుకుని మామూలు పిల్లవాడిలా జీవనం సాగించడం కష్టంగా ఉండేది. నిత్యం బలహీనంగా కనిపించేవాడు. ఏదైనా పని చేస్తే వెంటనే అలసిపోయి పడిపోయేవాడు. అది చూసిన దివా తమ్ముడిలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదనుకుంది. అప్పటి వరకూ ఈ వ్యాధి చిన్నారులకు వస్తుందని తెలియదు. అందుకే డయాబెటిస్‌తో బాధపడుతున్న వారిని ఆదుకోవాలని నిర్ణయించుకుంది.

తల్లిదండ్రుల్లో...

పిల్లల్లో డయాబెటిస్ లక్షణాలు కనిపిస్తున్నా కొంతమంది తల్లిదండ్రులు గుర్తించకపోవడంతో పరిస్థితి మరింత తీవ్రం అవుతుంది. రోగం ముదిరిన తర్వాత వైద్యులను సంప్రదించినా లాభం ఉండదని దివా 14 సంవత్సరాల వయస్సుకే అర్థం చేసుకుంది. అప్పటి నుంచి అసలు మధుమేహం వ్యాధిపై అధ్యయనం చేయడం మొదలుపెట్టింది. దాని గురించి తన పాఠశాల్లోనే కాకుండా చుట్టుపక్కల స్కూలు పిల్లలకు అవగాహన కల్పించింది.



పిల్లలకు వైద్యం అందించాలంటే కష్టంగా ఉంటుందని, ఆ సమయంలో వారు సహకరించరు. అందుకే పిల్లలకు నచ్చినట్లు వైద్యం చేయాలని సూచిస్తుంది. వ్యాయామం, ఆహారం, మందులు, గ్లూకోజ్ పర్యవేక్షణ మొదలైన అనేక మార్పులను ఎదుర్కోవలసి ఉంటుంది. వాటి గురించి పిల్లల తల్లిదండ్రులకు వైద్యులచేత, నిపుణుల చేత అవగాహన కల్పిస్తోంది. అందుకు తన తల్లిదండ్రుల సహకారం తీసుకుంది.

ప్రాజెక్టు సూర్య ద్వారా

2022లో విడుదల చేసిన ఐసిఎంఆర్ నివేదిక ప్రకారందేశంలో 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో టైప్ 1 మధుమేహం 95,600 కేసులు ఉన్నాయి. ఈ వయస్సులో ప్రతి సంవత్సరం 15,900 కేసులు నిర్ధారణ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్నాటకలో నిరుపేద పిల్లలకు వారి జీవన నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ఆమె రెండేళ్ల క్రితం 'ప్రాజెక్ట్ సూర్య'ను ప్రారంభించింది. డయాబెటిస్‌తో బాధపడుతున్న పిల్లలకు అవగాహన కల్పించి, వారికి సహాయం అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా పెట్టుకుంది. బెంగుళూరులో 100 కన్నా ఎక్కువ మధుమేహ పిల్లల కుటుంబాలను కలిసింది. వీరి కోసం ఎండోక్రినాలజిస్టులు, డైటీషియన్లు మరియు ఇతర వైద్యుల చేత సెషన్‌లను నిర్వహిస్తుంది. డయాబెటిస్ మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది కాబట్టి వారు కౌన్సెలింగ్ సెషన్‌లను కూడా నిర్వహిస్తుంది. అటువంటి పిల్లల్లో ఇతర రోగాలు ప్రభలకుండా జాగ్రత్తలూ తీసుకుంటుంది. ఇన్సులిన్ మరియు గ్లూకోజ్ స్ట్రిప్స్, సిరంజిలు అందిస్తుంది. మధుమేహ నిర్వహణ వనరులను స్పాన్సర్ చేయడానికి క్రౌడ్ ఫండింగ్ మరియు ఫండ్ రైజింగ్ ఈవెంట్‌ల ద్వారా నిధులను సేకరిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా



15,000 మంది వైద్యం పొందుతున్నారు. అతి చిన్న వయస్సులోనే ఎంతో ఓర్పుతో తోటి పిల్లల కోసం కష్టపడుతున్న దివాను చూసి అందరూ అభినందిస్తున్నారు. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న దివా చేస్తున్న సేవాకార్యక్రమాలను గుర్తించిన అధికారులు 'దివా డయానా అవార్డ్ 2023' అంతర్జాతీయ అవార్డు ఇచ్చి అభినందించారు.

పిల్లలకు జ్వరం, జలుబు రాకుండా

ఎండల నుంచి ఊరటనిచ్చే వర్షాకాలం పిల్లలకు ఎంతో ఇష్టం. చల్లదనం, ఆనందంతో పాటే వర్షాకాలంలో పిల్లలు కాస్త తొందరగా జ్వరం, జలుబు, దగ్గు వంటి వాటి బారిన పడే అవకాశమూ ఉంటుంది. ముందుగానే పిల్లలకు కొన్ని జాగ్రత్తలు చెప్పి సిద్ధం చేస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.

- జంక్ ఫుడ్ జోలికి పోకుండా సమతుల్య ఆహారం తినిపించండి. ఎక్కువగా ఫ్రై చేసిన ఆహారం, రోడ్డు పక్కన చిరుతిళ్లు, ఫాస్ట్ ఫుడ్, సరిగ్గా ఉడకని లేదా పచ్చిగా ఉన్న ఆహారం తినిపించకండి.
- కాచి చల్లార్చిన వేడి నీళ్లను తాగించండి. స్కూల్‌కి వెళ్లేటపుడు కూడా అవే నీళ్లను బాటిల్ లో పోసి ఇవ్వండి.
- వాళ్ల వయసు ప్రకారం వాళ్లకు వేయించాల్సిన వ్యాక్సినేషన్లు పూర్తిచేయండి. ఇంట్లో, ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచండి. దోమలు పెరగకుండా జాగ్రత్తపడాలి. వాటివల్ల మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- తడిగా ఉండే బట్టలు, షూలు వేయకండి. వాటివల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.
- భోజనం చేసే కన్నా ముందు తప్పకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. త్వరగా ఆరిపోయే బట్టలు వేయండి.
- బయట ఆడుకునే వీలు లేకపోతే, శారీరక వ్యాయామం కోసం ఇంట్లోనే స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ లాంటి ఆటలు ఆడేలా ప్రోత్సహించండి.
- రెయిన్ కోట్లు, గొడుగులు, నీళ్ల నుంచి రక్షించే గమ్ బూట్స్ సిద్ధం చేయండి.
- తులసి, దాల్చిన చెక్క, నిమ్మకాయం, అల్లం లాంటి మూలికల్ని వాళ్ల ఆహారంలో చేర్చండి. వీటిలో ఉండే పోషకాలు రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటూ జ్వరాలు రాకుండా కాపాడతాయి.
- పిల్లల్లో ఎలర్జీ సమస్య ఉంటే కార్పెట్లు, కర్టెన్లు లాంటివి ఎప్పటికప్పుడు శుభ్రం చేయండి. ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం బాలేకపోతే పిల్లలకు సోకకుండా జాగ్రత్తపడండి. ఎప్పటికప్పుడు ఇంటిని శుభ్రం చేస్తూ ఉండండి.
- ఈ కాలంలో మురికి నీళ్లలో ఆడుకుంటే జరిగే నష్టాలు చెప్పండి. వాళ్లే దూరంగా ఉంటారు.
- పొడవాటి చేతులున్న షర్టులు, ప్యాంట్లు వేయండి. దోమల నుంచి ఇవి రక్షిస్తాయి. అవసరమైతే ఇంట్లో దోమతెర వాడండి.బయట నుంచి ఇంటికి రాగానే చేతులు కడుక్కోవడం అలవాటు చేయండి.





సలార్ టీజర్ వచ్చేసింది..

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్' చిత్రం నుండి తాజాగా టీజర్ విడుదల చేశారు. 'సింహం.. చిరుత.. పులి.. ఏనుగు.. చాలా ప్రమాదం.. కానీ, జురాసిక్ పార్క్‌లో కాదు.. ఎందుకంటే ఆ పార్కులో...' అంటూ టీనూ ఆనంద్ డైలాగ్‌తో టీజర్ మొదలైంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. 'సలార్: పార్ట్1 : సీజ్‌ఫైర్' సెప్టెంబరు 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. పృథ్వీరాజ్ సుకుమారన్, శ్రుతిహాసన్, జగపతిబాబు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

'భాగ్ సాలే' నుంచి ట్రైలర్



మత్తు వదలరా వంటి వినూత్న కథతో ఎంట్రీ ఇచ్చి తొలి అడుగులోనే సక్సెస్ అయ్యాడు. శ్రీసింహ. ఇప్పుడు హీరోగా నటించిన తాజా చిత్రం 'భాగ్ సాలే'. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లు విడుదలైయ్యాయి. తాజాగా చిత్రబృందం ఈ సినిమా నుంచి కూత ర్యాంప్ ట్రైలర్ అంటూ కొత్త ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. ట్రైలర్ మరింత నవ్వులు పంచేలాగా ఉంది. కాగా ఈ చిత్రం జులై 7న విడుదల కానుంది. అవుట్ అండ్ అవుట్ ఫన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు ప్రణీత్ బ్రమండపల్లి దర్శకత్వం వహించాడు. సింహకు జోడీగా నేహ సోలంకి నటించింది. వైవా హర్ష, రాజీవ్ కనకాల కీలకపాత్రలు పోషిస్తున్నారు. బిగ్ బెన్ సినిమా, సినీ వాల్లే మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు కాలభైరవ సంగీతం అందించాడు.



కళ్యాణ్ రామ్ కొత్త సినిమా..

హీరో నందమూరి కళ్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి పూర్తి స్థాయి యాక్షన్ డ్రామాగా అది తెరకెక్కించనున్నారు. కళ్యాణ్ రామ్ 21వ చిత్రంగా రానున్న ఇది 'ఎన్‌కెఆర్ 21'గా ప్రచారమవుతోంది. దీనికి సంబంధించిన పోస్టర్ ఒకటి విడుదల చేశారు మేకర్స్. రక్తంతో తడిచిన చేతి పిడికిలిని చూపించారు. ఇందులో కళ్యాణ్ రామ్ కొత్త లుక్‌లో కనిపించనున్నారు. పూర్తి షూటింగ్‌ను ఇండియాలోనే చిత్రీకరించాలని నిర్ణయించుకున్నారు. త్వరలోనే నటీనటుల వివరాలు వెల్లడిస్తామన్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్‌లో మొదలుపెట్టి, వచ్చే ఏడాది విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు.



రాబోయే తరం ప్రతిభావంతులతో పనిచేస్తాను..

'ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలో ఎన్నో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కొత్త ప్రతిభని స్వీకరించడం, ఉన్నత వినోద విలువలతో నాణ్యమైన చిత్రాలను రూపొందించడానికి సహకరించడం అత్యవసరం. నేను నా అనుభవాన్ని పంచుకోవడానికి అలాగే కొత్త విషయాలను తెలుసుకోవడానికి రాబోయే తరానికి చెందిన ప్రతిభావంతులతో పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. వినోద్ సృజనాత్మకత, కంటెంట్ పట్ల నిబద్ధత కలిగి వున్న దర్శకుడు. సామాజిక ప్రాధాన్యతతో కూడిన కథలకు కమర్షియల్ అంశాలు జోడించి సక్సెస్‌ఫుల్ సినిమాలు తీస్తారనే పేరు వుంది. 'ఆర్‌కెఎఫ్‌ఐ 52' కూడా ఇలాంటి కలయికలోనే వుంది. ఈ చిత్రానికి కథ అందిస్తున్నందుకు చాలా ఎక్సయిటెడ్‌గా వున్నాను' అని కమల్ అంటున్నారు. కమల్‌హాసన్ తాజాగా హెచ్.వినోద్ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి ఆయనే స్వయంగా కథను అందిస్తున్నారని తెలుస్తోంది. రాజ్‌కమల్ ఫిలింస్ ఇండియా నిర్మాణంలో ఈ చిత్రం నిర్మితమౌతోంది.

12 నుండి షూటింగ్ ప్రారంభం



విజయ్ దేవర కొండ హీరోగా పరశురాం తెరకెక్కిస్తున్న సినిమా ఈ నెల 12 నుంచి రెగ్యులర్ షూట్ మొదలవుతుందని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. మృణాల్‌తో పాటు మరో హీరోయిన్ కూడా నటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ సినిమాకు 'ఫ్యామిలీ స్టార్' 'కుటుంబరావు' అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు. వచ్చే వేసవికి ఈ చిత్ర రిలీజ్‌ని ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

14న 'నాయకుడు'గా 'మామన్నన్'



తమిళ నటుడు వడివేలు, ఉదయనిధి స్టాలిన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మామన్నన్' చిత్రం తమిళంలో విడుదలై ఘన విజయం సాధించింది. ఫహద్ ఫాజిల్, కీర్తి సురేష్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించారు. తెలుగులో 'నాయకుడు' పేరుతో జులై 14న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ సురేష్ ప్రొడక్షన్స్, ఆసియన్ సినిమాస్ ప్రకటించారు.

లక్ష్యసేన్ సంచలనం

కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ తొలిరౌండ్‌లో 2వ సీడ్‌పై గెలుపు



ఒట్టావా(కెనడా): కెనడా ఓపెన్ సూపర్-300లో భారత టాప్ షట్లర్లు లక్ష్యసేన్, పివి సింధు శుభారంభం చేశారు. బుధవారం రాత్రి జరిగిన తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 21-18, 211-15తో 2వ సీడ్ విదిత్‌శరణ్(థాయ్‌లాండ్)పై సంచలన విజయం సాధించాడు. మరో పోటీలో బి సాయిప్రణీత్ 12-21, 17-21తో కోయల్ హో(బ్రెజిల్) చేతిలో వరుససెట్లలో ఓడాడు. ఇక మహిళల సింగిల్స్‌లో 4వ సీడ్ పివి సింధు 21-16, 21-9తో ఎన్‌జి తాలియా(కెనడా)పై సునాయాసంగా విజయం సాధించి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. మరో పోటీలో గద్దె శర్వాణి 12-21, 3-21తో కంటేథోంగ్(థాయ్‌లాండ్) చేతిలో ఓటమిపాలైంది. రెండోరౌండ్‌లో లక్ష్యసేన్ బ్రెజిల్‌కు చెందిన కోయల్ హోతో తలపడనున్నాడు. ఇక మహిళల సింగిల్స్ రెండోరౌండ్‌లో పివి సింధు జపాన్‌కు చెందిన నటసుకి నిడైరాతో తలపడనుంది. ఇక పురుషుల డబుల్స్‌లో కృష్ణప్రసాద్ గరగ-విష్ణువర్ధన్ గౌడ్ జోడీ 21-14, 21-16తో చైనీస్ తైపీ జోడీని చిత్తుచేసింది. మహిళల డబుల్స్‌లో రుతుపర్ణ పండా-స్వేతపర్ణ పండా జోడీ 21-15, 15-21, 9-21తో కెనడా జోడీ చేతిలో ఓటమిపాలైంది.

నెదర్లాండ్స్‌కు జాక్‌పాట్

వన్డే ప్రపంచకప్‌లో చోటు • స్కాట్లాండ్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు





హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్ జట్టు మరోసారి అర్హత సాధించింది. బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన హోరాహోరీ పోరులో నెదర్లాండ్స్ జట్టు 4వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై గెలిచి 1996 తర్వాత మరోసారి వన్డే ప్రపంచకప్‌లో చోటు దక్కించుకుంది. స్కాట్లాండ్ నిర్దేశించిన 278పరుగుల లక్ష్యాన్ని 44ఓవర్ల ఛేదిచాల్సి ఉండగా.. 42.5ఓవర్లలోనే ఆ లక్ష్యాన్ని నెదర్లాండ్స్ జట్టు కొట్టింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 277పరుగుల భారీస్కోర్ చేసింది. మెక్ ముల్లన్(106), కెప్టెన్ బెర్రింగ్టన్(64) బ్యాటింగ్‌లో రాణించారు. లీడేకు ఐదు, క్లైన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో నెదర్లాండ్స్ జట్టు 108పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డా.. లీడే(123; 92బంతుల్లో 7ఫోర్లు, 5సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కాడు. దీంతో నెదర్లాండ్స్ జట్టు 42.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 278పరుగులు చేసి విజయం సాధించింది. ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన లీడేకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ గెలుపుతో నెదర్లాండ్స్, జింబాబ్వే, స్కాట్లాండ్ జట్లు సూపర్-6లో 6పాయింట్లతో సమంగా ఉన్నాయి. శ్రీలంక జట్టు 8పాయింట్లతో (+1.817) రన్‌రేట్‌తో అగ్రస్థానంలో నిలిచి ఇప్పటికే వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించగా.. నెదర్లాండ్స్ జట్టు 6పాయింట్లతో (+0.230) రన్‌రేట్‌తో రెండోస్థానంలో నిలిచింది. ఇక స్కాట్లాండ్ 6పాయింట్లతో (+0.102), జింబాబ్వే 6పాయింట్లతో (-0.099)తో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించాయి. శ్రీలంక-వెస్టిండీస్ జట్ల మధ్య శుక్రవారం నామమాత్రపు సూపర్-6 మ్యాచ్ జరగనుండగా.. ఆదివారం నెదర్లాండ్స్-శ్రీలంక జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది.


అంతర్జాతీయ క్రికెట్‌కు తమీమ్ ఇక్బాల్ గుడ్‌బై



ధాకా: వన్డే ప్రపంచకప్ ముందు బంగ్లాదేశ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బంగ్లా వన్డే జట్టు కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇది అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని, తమ కుటుంబ సభ్యులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. నాన్న కన్న కలను నిజం చేయడానికి ఇంతకాలం క్రికెట్‌లో కొనసాగానని తెలుపుతూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. తాను ఆడేందుకు సహాయపడ్డ సహచరులు, కోచ్‌లు, బోర్డు అధికారులు, కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపాడు. 2007 ఫిబ్రవరిలో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన తమీమ్.. 70 టెస్టులు, 241వన్డేలు, 78 టి20లు ఆడాడు.

మూడోరౌండ్‌కు వావ్రింకా

తొలిరౌండ్ అడ్డంకి దాటిన సిట్సిపాస్, జ్వెరేవ్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



వావ్రింకా

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్‌లో అన్‌సీడెడ్ వావ్రింకా(స్విట్జర్లాండ్)6-3, 4-6, 6-4, 6-2తో 29వ సీడ్ ఎట్చ్‌వెర్రీపై నెగ్గి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లాడు. ఇక 3వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్) 3-6, 7-6(7-1), 6-2, 6-7(5-7), 7-6(10-8)తో ఐదుసెట్ల హోరాహోరీ పోరులో డోమినిక్ థీమ్‌పై నెగ్గాడు. 17వ సీడ్ హుర్కరాజ్(పోలండ్) 6-4, 6-4, 7-6(7-3)తో ఛోన్‌స్కీ(బ్రిటన్)పై, 14వ సీడ్ మసెట్టి(ఇటలీ) 6-4, 6-3, 6-1తో స్పెయిన్‌కు చెందిన మునర్‌పై గెలిచి మూడోరౌండ్‌లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్ ఇతర పోటీల్లో మరో పోటీలో అన్‌సీడెడ్ స్విటోలినా(ఉక్రెయిన్) 6-1, 1-6, 6-1తో 28వ సీడ్, జర్మనీకి చెందిన మెర్టెన్స్‌ను ఓడించి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. 16వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన ముఛోవా 4-6, 7-5, 1-6తో నెమ్మియర్(జర్మనీ) చేతిలో ఓడి ఇంటిదారి పట్టింది.

మార్ష్ సెంచరీ

ఆస్ట్రేలియా 263ఆలౌట్.. వుడ్‌కు ఐదు వికెట్లు

లీడ్స్: యాషెస్ సిరీస్ మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 263పరుగులకు ఆలౌటైంది. మిఛెల్ మార్ష్(118) సెంచరీకి తోడు హెడ్(39) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ కలిసి 5వ వికెట్‌కు 160పరుగుల జోడించారు. తొలుత ఆస్ట్రేలియా జట్టు 85పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. వార్నర్(4), ఖవాజా(13) నిరాశపరిచినా.. లబూషేన్(21), 100వ టెస్ట్ ఆడుతున్న స్టీవ్ స్మిత్(22) కూడా త్వరగా పెవీలియన్‌కు చేరారు. మార్ష్ ఔటయ్యాక లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఇలా వచ్చి, అలా వెళ్లారు. వుడ్‌కు ఐదు, వోక్స్‌కు మూడు, బ్రాడ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68